

అక్షరం.. పరిష్కారం

- నేడు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సమస్యలపై చర్చావేదికలు
- ఒంగోలు, మార్కాపురంలో నిర్వహణ
- పాల్గొననున్న ఎమ్మెల్యేలు, మేయర్, మునిసిపల్ చైర్మన్
- కమిషనర్లు, ఇతర అధికారులూ హాజరు



చర్చా వేదికకు సిద్ధమైన ఒంగోలు చెన్నకేశవస్వామి లేఅవుట్‌లోని ఎన్టీఆర్ పార్కు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిలిచేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేపట్టిన బృహత్తర కార్యక్రమం మంగళవారం ప్రారంభంకానుంది. అక్షరమే అండ.. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ప్రజల పక్షాన చేపట్టిన ప్రజావేదిక చర్చా కార్యక్రమాలు ఒంగోలు నగరం, మార్కాపురం మునిసిపాలిటీల్లో జరగనున్నాయి. మార్కాపురం మునిసిపాలిటీలో ఉదయం 8గంటలకు ఎనిమిదో డివిజన్‌లోని గొర్లగొడ్ల పీర్ల మకానం వద్ద ప్రారంభమవుతుంది. 7, 8 డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు అతిథులుగా హాజరుకానున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులోని 37వ డివిజన్‌లో సాయంత్రం 4.30 గంటలకు మరో కార్యక్రమం జరగనుంది. ఆ డివిజన్‌లోని చెన్నకేశవస్వామి లేఅవుట్‌లో ఉన్న ఎన్టీఆర్ పార్కులో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. అతిథులుగా మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు హాజరుకానున్నారు. రెండు ప్రాంతాల్లోనూ వీరితోపాటు అటు కార్పొరేషన్, ఇటు మునిసిపాలిటీ పరిధిలో ముఖ్య విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారు. చర్చా కార్యక్రమంలో ప్రజలు తెలియజేసే సమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు అక్కడికక్కడే స్పందిస్తారు. పరిష్కారానికి అనుగుణమైన సమస్యలపై స్పష్టత ఇస్తారు. పరిష్కారానికి నిర్దీత కాల పరిమితిని ప్రకటిస్తారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన అంశాలు ప్రజల నుంచి వ్యక్తమైతే ఆ బాధ్యతను ఎమ్మెల్యే తీసుకుంటారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు ఆయా డివిజన్లలో ఆంధ్రజ్యోతి బృందం పర్యటించగా ప్రజల నుంచి పూర్తిస్థాయి స్పందన వచ్చింది. చర్చా కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను వివరిస్తామని తెలిపారు. రెండు ప్రాంతాల్లోనూ కొన్ని సమస్యల పరిష్కారానికి ఈ చర్చా కార్యక్రమాల్లో స్పష్టత రావచ్చన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమైంది. ఒంగోలు 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి, డ్రైనేజీ సమస్యతోపాటు కొన్ని దీర్ఘకాలిక రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సమస్యలను అక్కడ ప్రజలు ప్రధానంగా ప్రస్తావించారు. మార్కాపురంలో చెరువు అలుగు కాలువ అభివృద్ధి, మంచినీటి కుళాయిల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, వీధిలైట్ల సమస్యలు ప్రధానంగా ప్రజలు ఆంధ్రజ్యోతి బృందానికి తెలిపారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్, కౌన్సిలర్లతోపాటు రాజకీయాలకతీతంగా ప్రజలు, ప్రముఖులు హాజరవుతున్న ఈ కార్యక్రమం ప్రజోపయోగకరంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తుంది.




కేవీపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరిలో ట్రిపుల్ ఐటీపై త్వరలో శుభవార్త

- మంత్రి డాక్టర్ స్వామి
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కేవీపల్లి హైస్కూల్‌లో రూ.64.70 లక్షలతో అదనపు గదులు
- రూ.5కోట్లతో కనిగిరి డిగ్రీ కాలేజీలో నూతన భవనం

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుపై ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పనుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. నియోజకవర్గంలోని పీసీపల్లి, కనిగిరి మండలాల్లో సోమవారం మంత్రి స్వామి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డితో కలసి విస్తృతంగా పర్యటించారు. కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కేంద్ర ప్రభుత్వ నిధులతో పీఎం ఉష పథకం కింద రూ.5కోట్లతో చేపట్టనున్న పనులకు మంత్రి స్వామి శంకుస్థాపన చేశారు. తొలుత మంత్రి, ఎమ్మెల్యేలకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి విద్యార్థులతో మాట్లాడుతూ అదనపు తరగతి గదులు, భవనాలు, మరమ్మతులు, పరికరాలు, మౌలిక సదుపాయాల కింద కోట్లాది రూపాయలను కనిగిరి డిగ్రీ కాలేజీకి వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రిలయన్స్ కంపెనీ ద్వారా పునరుద్ధరణ ఇంధన ప్లాంట్‌ను 4వేల ఎకరాల్లో పెడుతున్నట్లు మంత్రి చెప్పారు. 2014లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఎంతో దూరదృష్టితో ఈప్రాంత విద్యార్థుల సంక్షేమాన్ని కాంక్షించి ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా కనిగిరిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి నోచుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభు త్వం ఏర్పడిన 7నెలల్లోనే నియోజకవర్గంలో రూ.23కోట్లతో రోడ్లు నిర్మాణం చేపట్టామన్నా రు. కనిగిరి అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బయోగ్యాస్ కంపెనీ శంకుస్థాపన సాంకేతిక ఇబ్బందుల వలన జాప్యం జరిగిందని, వాటిని అధిగమించి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అనంతరం కాలేజీ ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ పి.భాస్కర్‌బాబు, డీఈఈ జగన్‌మోహన్‌రావు, డీఎల్‌డీవో శ్రీనివాసరావు

మిగతా 6వ పేజీలో

మూడేళ్లకే బీటలు

- వైసీపీ పాలనలో నిర్మించిన సిమెంట్ రోడ్డుకు పగుళ్లు
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న కండ్లగుంట ప్రజలు


కండ్లగుంటలో బీటలువారిన సిమెంటు రోడ్డు


సిమెంటు రోడ్డు మధ్యలో మొలిచిన మొక్కలు

నాగులుప్పలపాడు జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. అప్పటి కాంట్రాక్టర్, అధికారులు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. దీంతో నిర్మించిన మూడేళ్లకే సిమెంట్ రోడ్డు బీటలు వారింది. పిచ్చిమొక్కలు మొలిచి ఇది సిమెంట్ రోడ్డేనా? అన్న సందేహం కలుగుతోంది. వివరాల్లోకెళితే.. కండ్లగుంట గ్రామ పంచాయతీ పరిధిలో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం కింద 2020లో రూ.50లక్షలు మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులను 2021 నాటికి పూర్తి చేశారు. పొలాలకు, చెత్తసంపద కేంద్రానికి వెళ్లేందుకు అదే మార్గం కావడంతో గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద నుంచి 200 మీటర్లపైనే సిమెంట్ రోడ్డును నిర్మించారు. ఆ పనుల్లో సదరు కాంట్రాక్టరు నాణ్యతా ప్రమాణాలను పాటించలేదు. అధికారుల ఉదాసీన వైఖరితో పనులు పనులు పర్యవేక్షించిన అప్పటి పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కుబడిగా సాగాయి. దీంతో ఏళ్లతరబడి మన్నికగా ఉండాల్సిన సిమెంట్ రోడ్డు ముచ్చటగా మూడేళ్లు గడవక ముందే బీటలు వారింది. రోడ్డు మధ్యలో పిచ్చిమొక్కలు మొలిచాయి. దీంతోపాటు పలుచోట్ల నిర్మించిన సిమెంట్ రోడ్లకు సైడు మార్జిలు ఏర్పాటు చేయకుండానే అధికారం అండతో బిల్లులు తీసుకొన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టరు,

నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు



వైసీపీ ప్రభుత్వ హయాంలో కండ్లగుంటలో చెత్తసంపద తయారీ కేంద్రం వరకు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా మమ అనిపించి బిల్లులు తీసుకొన్నారు. తీరా మూడేళ్లకే రోడ్డు పగిలిపోయి దెబ్బతింది. ప్రజాధనాన్ని ఇష్టారీతిన స్వాహా చేసిన వారిపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలి.

- గుడిబండ ప్రభుదాస్‌రెడ్డి, కండ్లగుంట

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

- కలెక్టర్ అన్సారియా హెచ్చరిక
- ఇద్దరు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులకు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. సచివాలయాల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వివిధ కేటగిరిల్లో

మిగతా 6వ పేజీలో



మహాకాళి.. నృత్యకేళి..

7

ఒంగోలులో ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. నాటికలు ఆలోచింపజేస్తున్నాయి. సోమవారం వివిధ పాఠశాలల విద్యార్థులు ఆటపాటలతో మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు కాళికా అమ్మవారి వేషధారణలో భక్తిగీతానికి చేసిన నృత్యం ఆకట్టుకుంది.

ఎస్పీ గ్రీవెన్స్‌లో ఆత్మహత్యాయత్నం

న్యాయం చేయాలంటూ ఎలుకల మందు తిన్న మహిళ

- రిమ్స్ వైద్యశాలకు తరలించి చికిత్స
- నిలకడగానే బాధితురాలి పరిస్థితి


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు సౌభాగ్యం

ఒంగోలుక్రైం/త్రిపురాంతకం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి సంబంధించిన పత్రాలను సోదరులు తీసుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించాలని కోరుతూ ఒంగోలులో ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చిన మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. త్రిపురాంతకం మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పేరం సౌభాగ్యం తన పొలానికి సంబంధించిన పలుపత్రాలను సోదరులు తీసుకున్నారని, వాటిని ఇప్పించాలని కోరుతూ రెండేళ్ల క్రితం స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. నెలరోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఇదే విషయమై ఫిర్యాదు చేసింది. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐకి ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో సీఐ ఇరువర్గాలనూ పిలిచి విచారించారు. సరైన పత్రాలు ఇద్దరికీ లేవని, విషయాన్ని న్యాయస్థానంలో తేల్చుకోవాలని సూచించారు. ఈనేపథ్యంలో సౌభాగ్యం మళ్లీ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చారు. తనకు త్రిపురాంతకం పోలీసులు న్యాయం చేయడం లేదని.. మీరైనా పట్టించుకోవాలని కోరుతూ ఎలుకల మందు తినింది. అక్కడున్న పోలీసులు గమనించి వెంటనే బాధితురాలిని రిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. కాగా ఆత్మహత్యాయత్నంపై ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో సౌభాగ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

డేంజర్ కాల్..!

- కార్పొరేషన్ ఉద్యోగులకు సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇన్నాళ్లు సామాన్యులను మాయమాటలతో మోసగించి అకౌంట్లలో సొమ్మును ఊడ్చేశారు. ఇప్పుడు రూటుమార్చి ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. ఈక్రమంలోనే సైబర్ నేరగాళ్ల బెదిరింపు కాల్‌తో ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఒక్కసారిగా కలవరపడ్డారు. సోమవారం ఉదయం కార్పొరేషన్‌లోని ఓ ఉద్యోగికి ఏసీబీ అధికారులమంటూ ఫోన్‌కాల్ వచ్చింది. 'శానిటేషన్‌లో పనిచేసే ఇన్‌స్పెక్టర్లు బాగా లంచాలు తీసుకుంటున్నారు, అవినీతికి పాల్పడుతున్నారు. వెంటనే వారిని కాన్ఫరెన్స్‌లోకి తీసుకోవాలి' అంటూ 96061 96169 నెంబర్ నుంచి బెదిరింపులు వచ్చాయి. దీంతో భయపడిన సదరు ఉద్యోగి ఏమి చేయాలో దిక్కుతోచక ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కాన్ఫరెన్స్‌లో కలిపారు. ఉలిక్కిపడిన ఉద్యోగులు విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కమిషనర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ ఫోన్‌కాల్

మిగతా 6వ పేజీలో



పోలీసు కస్టడీకి తులసిబాబు

- గుంటూరు జైలు నుంచి ఒంగోలుకు తరలింపు
- మూడు రోజులపాటు విచారణ

వివరాలు మెయిన్‌లో..

కనిగిరిలో ట్రిపుల్ ఐటీపై త్వరలో శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

కాలేజి ప్రిన్సిపాల్ ఉషారాణి, తహసీల్దార్ రవికిషోర్, జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, రోషన్‌సందాని, జంషీర్ అహ్మద్, ఐవీ నారాయణ, నజీముద్దీన్, లక్ష్మయ్య, తిరుపాలు, కేవీఎస్‌గౌడ్, ఫిరోజ్, తాతపూడి స్టాలిన్ (బుజ్జి) పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన మెనూను సక్రమంగా అమలు చేయాలి

విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెనూను సక్రమంగా అందించాలని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. తాలుత మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలసి మంత్రి సందర్శించారు. హైస్కూల్ ప్రాంగణంలో పీఎంశ్రీ పథకం కింద రూ.64లక్షల 70వేలతో అదనపు తరగతి గదులు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు ఆట స్థలంలో వివిధ అభివృద్ధి పనులకు మరో రూ.5లక్షలు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ టీడీపీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, కనిగిరి క్లస్టర్ ఇంచార్జి నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి పాల్గొన్నారు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

(5వ పేజీ తరువాయి)

సచివాలయాల ద్వారా సేవలు అందకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సింగరాయకొండ, వైపాలెం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని జడ్పీ సీఈవో చిరంజీవిని ఆదేశించారు. పాఠశాలల టాయిలెట్ల తనిఖీ, బయోమెట్రిక్ హాజరు, ఏపీ సేవా సర్వీసుల పేమెంట్లు సకాలంలో జమ చేయకపోవడం, హౌస్ జియో పరిశీలన, ఎన్‌పీసీఐ నమోదు విషయంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పలు పర్యాయాలు చెప్పిన ఆశించిన స్థాయిలో పురోగతి కోసం ఎందుకు దృష్టిసారించడం లేదని ఎంపీడీవోలను ప్రశ్నించారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం ఏర్పాటుచేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్యంతోపాటు నీటి కుళాయి కనెక్షన్లు, ఇంటి పన్నులపై దృష్టిసారించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించి లేబర్ బడ్జెట్‌ను వినియోగించుకునేలా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల 1న సామూహిక గృహప్రవేశాలు ఉన్నందున పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు శ్రీనివాసప్రసాద్, వెంకటనాయుడు, జోసఫ్‌కుమార్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చి'వరి' భూములకు నీరేది?


చింతలపూడిలో నీటి ఎద్దడితో ఎండుముఖం పట్టిన వరిపైరు

- సాగర్ జలాలు అందక పైరు ఎండుముఖం
- ఆందోళనలో అన్నదాతలు

ముండ్లమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రజానగరం మేజర్ కింద వరిపైరు సాగుచేసిన రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. వరిపైరు సాగుచేసిన రెండు నెలలకే సాగర్ జలాలు అందక ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. రజానగరం మేజర్ పరిధిలో చింతలపూడి, కమ్మవారిపాలెం, చిన్నఉల్లగల్లు గ్రామాలకు చెందిన రైతులు 500 ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. 15 రోజుల నుంచి నీరు అందటం లేదు. దీంతో పైరు నెర్రెలు కొట్టి ఎండు ముఖం పట్టింది. వరిపైరు ఎదుగుదశలో నీటి ఎద్దడి ఏర్పడింది. ప్రస్తుతం పైరు పొట్టదశలో కొంతబాగం ఉంది. ఎన్ఎస్‌పీ అధికారులు సాగర్ జలాలు అందిచటంలో విఫలం చెందారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాగర్ డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉన్నా అధికారులు చివరి భూములకు నీరు అందించటంలో విఫలం చెందారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి తీరా పైరు ఎదుగుదశలో ఒక్కసారిగా నీటి ఎద్దడి ఏర్పడటంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు నీరు నడపాలని రైతులు కోరుతున్నారు.

పది రోజుల నుంచి నీరు అందటం లేదు

గత వారం పదిరోజుల నుంచి రజానగరం మేజర్ పరిధిలో చింతలపూడి, గ్రామంలోని రైతులకు సాగర్ జలాలు అందక వరిపైరు నెర్రలుకొట్టి ఎండు ముఖం పట్టింది. ఈ పరిస్థితుల్లో వరిపైరుకు నీరు అవసరం. నీరు రాకపోవటంతో దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉంది. అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సక్రమంగా నీరు ఇవ్వాలి.

- నవులూరి శ్రీను, వరిసాగు రైతు, చింతలపూడి

బాలికల విద్యకు ప్రోత్సాహం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
- రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ సాయంతో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ
- త్వరలో 10వేల మందికి అందజేత


విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుం దని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9 చదువుతున్న విద్యార్థినులకు మంత్రి నిధులు, నెదర్లాండ్స్ రోటరీ క్లబ్, దాతల సహకారంతో సమకూర్చిన సైకిళ్లను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భం గా రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలికలందరూ చదువుకోవాలన్న సదుద్దేశంతోనే వారిని ప్రోత్సహించేందుకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన ప్రకాశం జిల్లాలో ఎక్కువ మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారని, వారు గ్రామా ల నుంచి పట్టణాలకు రావాలంటే సరైన రవాణా సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి చదువుకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు సు మారు 40 ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సైకిళ్ల ను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు.

రూ.5కోట్లతో పదివేల సైకిళ్ల పంపిణీ

ప్రస్తుతం 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు సైకిళ్లు ఇచ్చామని, ఇక్కడ పరిస్థిని చూస్తే 6, 7 తరగతుల విద్యార్థినులకూ సైకిళ్లు అవసరంగా గుర్తించామని మంత్రి తెలిపారు. వారికి కూడా త్వరలో సైకిళ్లను అందిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సుమారు పది వేల సైకిళ్లు అవసరమని, వాటిని ఏడాదిలో అందిస్తామని తెలిపారు. తన సొంత నిధులతో పాటు రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ వారి సహాయం, దాతల సహకారంతో బాలికలందరికీ సైకిళ్లు సమకూర్చుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు సుమారు రూ.5కోట్లకు పైగా ఖ ర్చు అవుతుందని తెలిపారు. తరగతి గదులు అదనంగా కావాలని పాఠశాల యాజమాన్యం కోరగా త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు, రోటరీ నెదర్లాండ్స్ ప్రతినిధులు లియో జ్యాగ్ మేకర్, కీస్ వాన్డెన్ బెర్గ్, కోన్ వెస్సర్, వివిధ శాఖల అధికారులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

ఒంగోలు విద్య, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 (ఇంటర్మీడియేట్) తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు వచ్చేనెల 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారు కామన్‌సర్వీస్ సెంటర్ల నుంచే హాల్ టిక్కెట్లను పొందాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచే హాల్ టిక్కెట్లను పొందవచ్చున్నారు. వచ్చేనెల 5వతేదీ వరకు ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు పొందవచ్చన్నారు. దరఖాస్తు రశీదులు చూపించి హాల్‌టిక్కెట్లు పొందాలన్నారు. ఇతర వివరాలకు 9951091988 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోడౌన్ షట్టర్లకు వేసిన తాళం సీల్‌ను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలతో పాటు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి ఇతర సిబ్బంది ఉన్నారు.

టెన్త్ పరీక్షలకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్లు

ఒంగోలు విద్య, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 17నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కే శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించి సజావుగా నిర్వహించేందుకు ఈ ఫ్లయింగ్ స్క్వాడ్లు దోహదం చేస్తాయన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేసుకొనేందుకు డైరెక్టర్ ఆమోదం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. చినగంజాం మం డలం కడవకుదురు నుంచి వేటపాలెం మండలం పాపాయిపాలెంకు వెళుతున్న పోత ఇసుక టిప్పర్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

ఎంఈవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్‌జేడీ



సింగరాయకొండ ఎమ్మార్సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ

టంగుటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సోమవారం పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలల వారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా గ్రామ పంచాయతీలో కనీసం ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో కలపాలన్నారు. బోగస్ ఎన్‌రోల్‌మెంట్ ఉంటే సదరు ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఉపవిద్యాధికారి చంద్రమౌళేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎంఈవోలు చెంచుపున్నయ్య, తన్నీరు బాలాజీ, క్లస్టర్ హెచ్‌ఎంలు తులసిప్రభ, సుధారాణి పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : మండల కాంప్లెక్స్‌లోని ఎమ్మార్సీని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్స్‌గా త్వరితగతిన రీఆర్గనైజేషన్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఒంగోలు ఉపవిద్యాధికారి చంద్రమౌళేశ్వరరావు, ఎంఈవో కత్తి శ్రీనివాసులు ఉన్నారు.

పాఠశాలల్లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఆర్అండ్ పీఎం, జాండ్రపేట హైస్కూల్, వేటపాలెం మం డల పరిధిలోని దేశాయిపేట హైస్కూల్, వేటపాలెం ఎంపీపీ స్కూళ్లను ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో భాగంగా పాఠశాలల్లోని అటెండెన్స్ రిజిస్టర్, వంట గది తదితర వాటిని ఆర్డీవో పరిశీలించారు, విద్యార్థులో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాలకు భిన్నంగా మోసపూరిత వ్యవహారాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో హెచ్చరించారు. బడి బ యట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆయనవెంట కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పట్టపగలు దొంగతనం

- నకిలీ తాళాలతో ఇంటి తలుపులు తెరిచిన దొంగలు
- బీరువా తెరిచి 10 సవర్ల బంగారం చోరీ
- కురిచేడులో ఘటన

కురిచేడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కురిచేడులోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుని ఇంట్లో పట్టపగలు తాళాలు పగులకొట్టి 10 సవర్ల బంగారం చోరీ చేసిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కురిచేడు నుసుం బజారులో మంచినీళ్ల బావి దగ్గర ప్రాథమిక పాఠశాల ఎదురుగా మండలంలోని పెద్దవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మాదినేని హనుమంతరావు నివాసం ఉంటున్నారు. ఆయన భార్య సైతం బయ్యవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారు ఉదయాన్నే వారి వారి పాఠశాలలకు వెళ్లారు. సాయంత్రం వారు వచ్చి చూసే సరికి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తెరిచి ఉంది. అందులో దాచిన హనుమంతరావు బంగారు చైన్, భార్య నల్లపూసల గొలుసు, ఉంగరం, పిల్లల ఉంగరాలు, మాటీలు కనపడలేదు. మొత్తం బంగారం 10 సవర్ల వరకు పోయిందని ఆయన తెలిపారు. బీరువా తాళాన్ని వెతికి దాని సాయంతో తెరిచారు. బయట గ్రిల్‌కు సైతం తాము వేసిన తాళం మాదిరి మరొటి వేసి ఉంచారు. అంటే దొంగలు ముందుగానే ఆ ఇంటి తాళాన్ని పోలిన తాళం మరొకటి తీసుకువచ్చారు. పక్కా ప్లాన్‌తోనే దొంగలు వచ్చినట్లు అర్థమవుతోంది. మధ్యాహ్న సమయంలో ఇరువురు వ్యక్తులు హనుమంతరావు ఇంటి గేటు దూకడం చూశామని పిల్లలు చెప్తున్నారు. హనుమంతరావు ఇంటి చోరీ జరిగిన విషయం గమనిస్తే తెలిసిన వాళ్లే అయి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం నిపుణులను పిలిపించి వివరాలు సేకరించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

29 నాటికి పాఠశాలల హేతుబద్ధీకరణ పూర్తి

ఒంగోలు విద్య, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యా సంస్కరణల్లో భాగంగా చేపట్టిన పాఠశాలల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు ఈనెల 29 నాటికి సిద్ధం చేయాలని పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి మండల విద్యాధికారులను ఆదేశించారు. పాఠశాలల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలను స్వయంగా పరిశీలించేందుకు ఆర్జేడీ సోమవారం ఒంగోలు, టంగుటూరు సింగరాయకొండ మండలాల్లో ఆకస్మికంగా సందర్శించారు. ఆయా మండలాల్లోని మండల విద్యాధికారులు 1, 2, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో సమావేశాలు నిర్వహించి వారు తయారు చేసిన ప్రతిపాదనలు పరిశీలించారు ఎంఈవోలకు లింగేశ్వరరెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 117 జీవో ఉపసంహరణ నేపథ్యంలో హైస్కూళ్ల నుంచి వెనక్కువస్తున్న 3,4,5 తరగతుల విద్యార్థులను ఏ పాఠశాలల్లో చేర్పించాలన్న విషయంలో ఎంఈవోలకు స్పష్టత ఇచ్చారు. పాఠశాలల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పంచాయతీలో కనీసం ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి అవసరమైతే కిలోమీటరులోపు పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను తరలించి మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వరుసగా 30 రోజులు పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులను కచ్చితంగా డ్రాప్ అవుట్స్ బాక్సులో పెట్టాలన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణపై పాఠశాల విద్య కమిషనర్ సీరియస్‌గా ఉన్నందున ఎటువంటి వివాదాలకు తావులేకుండా పాఠశాలల రేషన్‌లైజేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఏఎంవో ఎం.రమేష్ ఉన్నారు.

డేంజర్ 'కాల్'!

(5వ పేజీ తరువాయి)

ఎక్కడ నుంచి వచ్చింది? లోకేషన్ ఏమిటి.. ఇందులో వాస్తవమెంత? అనే విషయాన్ని పరిశీలించారు. ఫోన్ చేసిన వ్యక్తి బెంగళూరులో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ నేరగాళ్ల నుంచి కాల్ వచ్చిందని తెలుసుకున్న కార్పొరేషన్ ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. దీనిపై కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అప్రమత్తమై మరింత లోతుగా విచారణ చేపట్టడంతో కార్పొరేషన్ ఉద్యోగికి నుంచి వచ్చిన ఫోన్ నంబర్ నుంచి ఆదివారం హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌కి కాల్ చేసినట్లు తెలిసింది. ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నాను. మీ డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులను లైన్‌లోకి తీసుకుని కాన్ఫరెన్స్ కలపాలని బెదిరించినట్లు తెలిసింది. అయితే హౌసింగ్ అధికారులు ఆందోళనకు గురై, మొదట్లో కొంత భయపడగా, ఆ తర్వాత తేరుకుని సైబర్ నేరగాళ్ల పని అని గుర్తించారు. అయితే దీనిపై కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏసీబీ అధికారులు నేరుగా ఫోన్ చేసి మాట్లాడరని, ఎవరైనా కాల్‌చేసి అలా చెబితే ఇతరుల ఫోన్ నెంబర్లు ఇవ్వొద్దని తెలిపారు. వెంటనే వచ్చిన ఫోన్ నెంబరును పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

ప్రమాదకరంగా చప్టా

- కొణిదెన - ఉప్పుమాగులూరు రోడ్డులో ప్రయాణమంటేనే హడల్
- ఆందోళనలో ప్రయాణికులు


కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో దెబ్బతిన్న నేల చప్టా

బల్లికురవ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో నేల చప్టా ప్రమాదకరంగా తయారైం ది. చప్టాపై సిమెంట్ మెత్తం లేచి పోయి బద్దబద్దలుగా పగిలిపోవడంతో వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయణం అంటేనే హడలి పోతున్నారు. రాత్రి సమయంలో ఎవరైన ఈ మార్గంలో వస్తే ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలకు రాళ్లను రవాణా చేసే వాహనాలు చప్టా వద్దకు వచ్చి కురుకు పోతున్నాయి. ఇంతటి ప్రమాదంగా ఉన్న చప్టా గురించి ఎవరు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైతులు అయితే పొలాలకు ఈ చప్టా మీదగా వెళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నేల చప్టాను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతగా వాహనాలు నడపాలి

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి ఆధారంగా ఉన్న యజమాని బాధ్యతగా వాహనాలు నడపాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సోమవారం వేటపాలెం స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో పలుచోట్ల ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి డ్రమ్ములు, హోర్డింగులను ఏర్పా టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తరచూ సాధారణంగా మారాయన్నారు. ప్రమాదాంతో కుటుంబంలో వ్యక్తులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుందన్నారు. ఈక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలన్నారు.




అద్దంకి పట్టణంలోని బోడెంపూడివారిపాలెంలో హరి ప్రసాద్ ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఆవు, దూడ బొమ్మ

ఆవును పెంచాలనే భావనతో బొమ్మ ఏర్పాటు చేసుకున్నాను



ఇంటి ముందు ఆవును పెంచాలనే ఆలోచన ఉండేది. కానీ పోషణ చేయలేనన్న భయంతో ఆవుదూడ బొమ్మను ఏర్పాటు చేసుకున్నాను. రైతు కుటుంబం కాబట్టి ప్రహరీపై రెండు ఎద్దుల బొమ్మలను ఏర్పాటు చేశాను. ఆ బొమ్మలను చూసినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది.

-రావిపాటి హరిప్రసాద్, బోడెంపూడివారిపాలెం, అద్దంకి



అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెంలో నల్లూరి బోస్ ఇంటి ప్రహరీపై కోడిపుంజుల బొమ్మలు

నాన్నకు కోళ్లు అంటే ఎంతో అభిమానం



నాన్నకు కోడి పుంజులంటే ఎంతో అభిమానం. మేం చిన్నతనంలో ఉండగా ఇంట్లో కోళ్లు ఉండేవి. దశాబ్దకాలం క్రితం నాన్న రాజమండ్రి వెళ్లి రెండు కోడి పుంజుల బొమ్మలు తీసుకు వచ్చి ప్రహరీపై ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆ బొమ్మలను చూసి నాన్నతో పాటు కుటుంబంలో అందరం ఎంతో ఆనందపడుతుంటున్నాం.

- రావిపాటి పవన్, నర్రావారిపాలెం, అద్దంకి

బొమ్మను చేసి.. ప్రేమను చూపి..

పశువులు, పక్షులపై అద్దంకిలో రైతుల మమకారం

- పెంపకం చేయలేక ఇళ్ల వద్ద బొమ్మల ఏర్పాటు
- ప్రహరీపై ఆవు, ఎడ్లు, కోడి పుంజు బొమ్మలు
- వాటిని చూస్తూ సంతృప్తి చెందుతున్న జంతు ప్రియులు

అద్దంకి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఏ ఇంటి ముందు చూసినా పదుల సంఖ్యలో ఆవులు, ఎడ్లు, కోళ్ల ఉండేవి. వాటి పెంపకం ద్వారా రైతు కుటుంబాలు ఆదాయం పొందడంతో పాటు ఆనందంగా జీవించేవారు. కాలక్రమేపీ వాటి పెంపకం తగ్గిపోతోంది. ప్రస్తుతం అత్యధిక గ్రామాల్లో సైతం ఎడ్లు, ఆవులు, కోళ్ల పెంపకం తగ్గిపోయింది. కొంత మంది రైతులు ఆదాయం కోసం గేదెలు, ఆవుల పెంచుతున్నారు. ఎడ్ల స్థానంలో వ్యవసాయ పనులకు ట్రాక్టర్‌లు వినియోగం పెరిగింది. ఈ క్రమంలో నాటి రైతు కుటుంబాలకు చెందిన కొందరు పశువులు, పక్షులపై మమకారంతో ఇళ్ల వద్ద బొమ్మలను ఏర్పాటు చేసుకొని సంతృప్తి చెందుతున్నారు. అద్దంకి పట్టణంలో గతంలో పలువురు ఇళ్ల మీద నీళ్ల ట్యాంక్‌లను ఆవు ఆకారంలో ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో అద్దంకి పట్టణంలోని రెండు రైతు కుటుంబాల ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల బొమ్మలను చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలేనికి చెందిన నల్లూరి బోసుకు కోడి పుంజులు అంటే మమకారం. దశాబ్ద కాలం క్రితం రాజమండ్రి నుంచి రెండు కోడి పుంజుల బొమ్మలను కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇంటి ప్రహరీపై ఏర్పాటు చేశారు. బోడెంపూడివారిపాలెంకు చెందిన రావిపాటి హరిప్రసాద్ వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ బేల్దారి మేస్త్రీ, బిల్డర్‌గా స్థిరపడ్డారు. ఆవును ఇంటి వద్ద పెంచాలనే కోరిక. కానీ పోషణ చేయటం భారమని భావించి ఆవుదూడ బొమ్మను ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్నారు. అదే సమయంలో ఇంటి ప్రహరీపై రెండు వైపులా చిన్న ఎడ్ల బొమ్మలు ఏర్పాటు చేశారు. ఇలా పలువురు తమకు ఇష్టమైన బొమ్మలను ఏర్పాటు చేసుకొని సంతృప్తి పొందుతున్నారు.



బోడెంపూడివారిపాలెంలో హరిప్రసాద్ ఇంటి ప్రహరీపై ఏర్పాటు చేసిన ఎడ్ల బొమ్మ



దేవీ నవరాత్రుల్లో అమ్మవారుల ఉగ్రరూపాల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

భళా... నృత్య కళ

- అలరించిన నృత్యాలు ● ఆసక్తికరంగా మైరావణ నాటకం ● ఉత్సాహంగా విద్యార్థుల కోలాటం

ఒంగోలు కల్చరల్ , జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాల్లో సోమవారం రాత్రి నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నాయి. శ్రీరాం ఒలంపియాడ్ హైస్కూల్, రవీంద్ర భారతి పబ్లిక్ స్కూలు విద్యార్థులు చక్కటి వేషధారణలతో దేశభక్తి, దైవభక్తి గీతాలకు, పల్లెటూరు వాతావరణం ప్రతిబింబించే జానపద గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు తొలి కార్యక్రమంగా శేదు సిద్దయ్య, రామేపల్లి మస్తాను, మాలకొండయ్య, తెంచలపాడు నరసింహల నాదస్వర కచ్చేరి వీనులవిందుగా కొనసాగింది.

● అమ్మనబ్రోలుకు చెందిన విజ్ఞాన భారత్ హైస్కూల్ విద్యార్థులు సుమారు 70 మంది ఉత్సాహభరితంగా కోలాటాన్ని ప్రదర్శించారు. మాస్టర్ తన్నీరు అంకమ్మ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కోలాట ప్రదర్శనలో పలు జానపద, సినీ గీతాలకు లయబద్ధమైన కోలాటాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలందుకున్నారు.



అలరించిన 'మైరావణ'

నాటక ప్రదర్శనలో భాగంగా జడ్చర్ల నవజ్యోతి కళామండలి వారు ప్రదర్శించిన మైరావణ పద్య నాటకం భక్తిరసభరితంగా సాగింది. రావణాసురుని మేనమామ అయిన మైరావణుడు పాతాళలంకను పాలించే రాజు. అతనొక మహా మాయావి. అతనికి ఒక చెల్లెలు ఉండేది. ఆమె కుమారుడు జన్మించగానే అతడు పాతాళలంకకు రాజు అవుతాడని జ్యోతిష్యులు చెప్పగా అది తెలుసుకున్న మైరావణుడు చెల్లెలిని అతని కుమారుని కారాగారంలో బంధిస్తాడు. చివరికి ఆంజనేయుని చేతిలో మైరావణుడు హతం కావటం ఇతివృత్తంగా ఈ నాటకం కొనసాగింది. తడికమళ్ల రామచంద్రరావు దీనికి దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రదర్శన సంస్థలకు ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రదర్శన పారితోషికాన్ని, జ్ఞాపికను బహూకరించి అభినందించారు.

పృథులగిరి రహదారికి మోక్షం

మంత్రి స్వామి చొరవతో తొలగిన అటవీశాఖ అడ్డంకులు

మర్రిపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి కొండకు వెళ్లే రహదారి పనులకు మోక్షం లభించింది. అటవీశాఖ అడ్డంకులతో 1208 మీటర్ల రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మర్రిపూడి బస్టాండ్ నుంచి పృథులగిరి మెట్ల వద్దకు, అక్కడ నుంచి జాప్లాపురం యానాదికాలనీ వరకు 10.9 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో 8.5కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనులు అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో 1280 మీటర్ల మేర పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో రహదారి పనులకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో తారురోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ఆఘమేఘాల మీద ప్రారంభించారు. ఇప్పటికే రోడ్డు లెవలింగ్ పనులు పూర్తి చేశారు. నరసింహులు వాగు నుంచి పృదులగిరి మెట్ల వరకు మొదటి లేయర్ జీఎస్‌బీ పనులు పూర్తి అయ్యాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తి అయితే పృదులగిరికి చేరుకునే భక్తులకు రవాణా సౌకర్యాలు మెరుగౌతాయి.



వేగంగా రహదారి నిర్మాణ పనులు

ఆలయ అభివృద్ధికి కృషి

పృథులగిరిని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేసేందకు మంత్రి స్వామి కంకణం కట్టుకున్నారు. ఇప్పటికే కొండపైన రూ.50 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. సోపాలనాల వద్ద నుంచి కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.8కోట్ల నిధులతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. టూరిజం శాఖ ద్వారా నిధులు రాబట్టేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తంమీద పృథులగిరి రహదారి పనులు వేగంగా పూర్తి కావస్తుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీజీహెచ్‌లో చిన్న గుండెకు చేయూత

- కలెక్టర్ అన్సారియా ● చిన్నపిల్లల్లో 32 రకాల వ్యాధులకు ఉచిత స్ర్కీనింగ్ పరీక్షలు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) చిన్న పిల్లలకు కార్పొరేట్ వైద్యశాలల ద్వారా చికిత్సలకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం జీజీహెచ్‌లోని బాల భవిత కేంద్రంలో చిన్నారులకు స్ర్కీనింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. 60 మంది చిన్నారులకు అపోలో వైద్యుల ద్వారా స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో తొమ్మిదిమందికి చికిత్స అవసరం అని గుర్తించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పుట్టుకతో గుండెజబ్బులతో పుట్టిన వారికి జిల్లా వ్యాప్తంగా స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందని తెలిపారు. అందుకోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. చిన్న పిల్లల గుండె జబ్బుల చికిత్స నిమిత్తం చెన్నై, అపోలు వారితో ఒప్పందం జరిగిందని తెలిపారు. తొలి దశలో జబ్బును గుర్తించి, అవసరమైన వారికి చికిత్స చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలోని ప్రజలు తమ సమీప ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించడం ద్వారా వారు స్ర్కీనింగ్ పరీక్షలకు సిఫారసు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఐసీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథ, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవి లత, అపోలో వైద్యులు డాక్టర్ అరుణ్ విజయ్, మెడికల్ ఆఫీసర్ ప్రీతమ్, వైద్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



చిన్నారికి స్ర్కీనింగ్ ప్రక్రియ అనంతరం ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీ హెడ్ మేనేజర్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీ హెడ్ మేనేజర్ నల్లమలుపు భాస్కరరెడ్డి మృతిచెందారు. ఈ ఘటన సోమవారం తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. అనారోగ్యమా.. లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అన్నది తెలియాల్సి ఉంది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గురువారెడ్డిపాలేనికి చెందిన భాస్కరరెడ్డికి 15ఏళ్ల కిందట నరసరావుపేటకు చెందిన ఉదయలక్ష్మితో వివాహమైంది. వీరికి సంతానం లేదు. నరసారావుపేటలోని వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీకి రాయలసీమ హెడ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలో తిరుపతి రూరల్ ధనలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. సెలవు వచ్చినప్పుడు నరసరావుపేటలోని భార్య వద్దకు వెళ్లి వచ్చేవారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఎవరు ఫోన్ చేసినా తీయలేదు. సందేహం వచ్చి సోమవారం ఉదయం 10.30గంటల ప్రాంతంలో వల్లభ కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ప్రసన్న ఆంజనేయులు ఆయన ఇంటికి వెళ్లి తలుపులు కొట్టగా తెరవలేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా పడుకుని ఉన్నట్లు కనిపించారు. ఇంటి యజమానితో కలిసి తలుపులు కొట్టి తెరచుకోగా అతడు చాపపై కొద్దిగా బోర్లా పడుకుని చనిపోయాడని గుర్తించారు. ముక్కు నుంచి రక్తం కారుతూ ఉంది. ఒంగోలులో ఉంటున్న మృతుడి అక్క లక్ష్మికి ఫోన్ చేసి చెప్పగా వాళ్లు వచ్చారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేదా అనారోగ్యంతో మృతిచెందాడా అనే అనుమానాలు వ్యక్తంచేశారు. దీనిపై లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

ఏడాదిన్నర పాప... అమెరికా దంపతులకు దత్తత

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అమెరికాకు చెందిన దంపతులకు ఒంగోలులోని శిశుగృహలోని పాప కీర్తి (ఏడాదిన్నర)ని కలెక్టర్ తమీమ్ అన్సారియా దత్తత ఇచ్చారు. అమెరికాలో స్థిరపడిన అర్పన్ దేశాయ్, కున్తి దేశాయ్ గుజరాత్ రాష్ట్రానికి చెందినవారు. ఉద్యోగ నిమిత్తం వారు అమెరికాలోని నార్త్‌కోలరాడ రాష్ట్రంలో స్థిరపడ్డారు. అమెరికాలో ఉన్నత స్థానంలో అర్పన్ దేశాయ్ సీమెన్స్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తుండగా ఆయన సతిమణి కున్తి దేశాయ్ అదే కంపెనీలో అకౌంట్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉన్నత స్థానంలో ఉన్నారు. ఆన్‌లైన్‌లో పాప వివరాలు తెలుసుకుని దత్తత తీసుకోవాలనుకున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో చిన్నారి కీర్తిని అమెరికా దంపతులకు కలెక్టర్ అప్పగించారు. చిన్నారిని కలెక్టర్ అన్సారియా ఎత్తుకొని వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి హేన సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ ఉన్నారు.



ఏడాదిన్నర పాపను అమెరికా దంపతులకు దత్తత ఇస్తున్న కలెక్టర్ అన్సారియా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు (ఫైల్)

అందరూ విద్యావంతులు కావాలి



ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావడమే ఉల్లాస్ లక్ష్యం. గ్రామాల్లో నిరక్ష్యరాస్యులైన ప్రతి పదిమందికీ ఒక టీచర్‌ను నియమించాం. మొదటి విడత గుర్తించిన వారికి మార్చిలోగా శిక్షణ పూర్తిచేస్తాం. స్వయం సహాయక సంఘాల్లోని చదువుకున్న వారిని విద్యా వలంటీర్లుగా నియమిస్తాం.

- టి.బాబూరావు, ఏపీఎం, సంతనూతలపాడు

ఉల్లాస్‌తో ఇంటి దీపానికి అక్షర వెలుగులు

సంతనూతలపాడు, జనవరి 27(ఆంధ్యజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం అమలుకు సిద్ధమైంది. నవభారత్ సాక్షరతా కార్యక్రమం (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) ఎన్‌ఐఎల్‌పీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో వయోజన విద్య, డీఆర్‌డీఏ సమన్వయంతో కార్యక్రమం కొనసాగనుంది. గ్రామాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడంతో పాటు, డిజిటల్ లావాదేవీలను అలవాటు చేసేందుకు వయోజన విద్యాశాఖ ఉల్లాస్ పేరుతో ప్రత్యేక కార్యచరణకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా మూడేళ్లపాటు కొనసాగించనున్న ఈ కార్యక్రమంలో ఏటా కొందరిని గుర్తించి శిక్షణ ఇస్తుంది.

మండలానికి 844 మంది గుర్తింపు

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎక్కువమంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులే. అయితే సంతనూతలపాడు మండలం నుంచి 844 మందిని నిరక్షరాస్యులను గుర్తించారు. ఈ ఏడాది తొలివిడతగా ఎంపిక చేసిన వారికి మార్చి నెలాఖరుకు శిక్షణ పూర్తిచేయాలని నిర్ణయించారు.



ట్రైనింగ్ పుస్తకాలను చూపుతున్న నిర్వాహకులు

ఈ క్రమంలో ఇప్పటికే టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. త్వరలో అభ్యాసన మెటీరియల్ రానుంది. ప్రతి పదిమందికి ఒక స్వచ్ఛంద శిక్షకురాలిని నియమించి, రోజుకు రెండు గంటలపాటు అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, ప్రభుత్వపాఠశాల ఆవరణలో ఎక్కడో ఒకచోట తరగతులు నిర్వహిస్తారు.

ఇవీ నేర్పనున్న అంశాలు

వయోజనులకు అక్షరాలు, పదాలు నేర్పడం, చిన్నపాటి అంకెలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. ఆర్థిక ప్రణాళికను ప్రారంభించేందుకు, పొదుపు అలవాట్ల పెంపొందించడానికి చిన్నపాటి గుణకారాలు, కూడికలు, తీసివేతలు నగదు ఇచ్చిపుచ్చుకునే అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తారు. చాలామందికి డిజిటల్ అక్ష్యరాస్యతపై అవగాహన లేదు. వీటిని అధికమించేందుకు బ్యాంకులో లావాదేవీలు, వ్యాపార వాణిజ్య, వర్తక సముధాయాల్లో నగదు చెల్లింపుల స్థానాల్లో ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లింపులపై అవగాహన పాఠాలు చెబుతారు. చదవడం, రాయడం, సెల్‌ఫోన్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తారు.

పరిశరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆహారం, ఇరుగు, పొరుగు ఆచార వ్యవహారాలపై, పిల్లల పెంపకంపై వివరిస్తారు. సంఘం ఎన్నికల నిర్వహణ తీరు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. టోల్‌ఫ్రీ నెంబర్ల ఉపయోగం, గడియారంలో సమయం చూడటం, క్యాలిక్యులేటర్ వినియోగం, అవసరమైన సమయంలో మెసేజ్‌లు ఎలా పంపాలో, ఈ-మెయిల్, సామాజిక మాధ్యమాల వాడకం, బ్యాంకు లాదేవీలు, యూపీఐ చెల్లింపులు వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. వీటికి టీసీఎస్ సంస్థ సాంకేతిక సహాయం అందించనుంది. ఈ కార్యక్రమానికి కేంద్రప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి సరైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అధికారులు రోజప లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, విజయజ్యోతి, కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

● నడవలేని స్థితిలో ఉన్నానని, మూడుచక్రాల సైకిల్‌తో పాటు జీవనాధారం కోసం రుణం మంజూరు చేసి ఆదుకోవాలని స్థానిక సత్యనారాయణపురంకు చెందిన పోలిశెట్టి మల్లేశ్వరి కోరారు. దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ లేకపోవడంతో ఆమె భర్త లక్ష్మణ్ చేతులతో ఎత్తుకొని గ్రీవెన్స్‌సెల్‌కు తీసుకొని వచ్చారు. కలెక్టర్‌కు అర్జీ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

● గ్రామాల్లో పనులు లేకపోవడంతో కూలీలు, పేదలు వలస బాట పట్టారని అందువల్ల కూలీలకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు కోరారు. అలాగే ఉపాధి హామీలోచేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా చూడాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట న్యాయపోరాటం చేస్తున్న వృద్ధురాలు

ఆక్రమణదారుడి నుంచి స్థలాన్ని ఇప్పించండి

● కలెక్టరేట్ ఎదుట న్యాయపోరాట దీక్ష

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన స్థలాన్ని ఆక్రమించుకొని ప్రైవేటు స్కూలు నిర్వహిస్తున్న ఎం. విజయకుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పామూరుకు చెందిన కే జ్యోతిర్మయి, టి. జయప్రదలు న్యాయ పోరాటం దీక్షను చేపట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఈ దీక్ష చేపట్టారు. పామూరులో గృహ నిర్మాణం కోసం తెనాలి అన్నమ్మకు ప్రభుత్వం 206/2 సర్వేనెంబరులో ఇచ్చిన ఇంటి స్థలాన్ని జయకుమార్ అనే వ్యక్తి ఆక్రమించి స్కూలు నిర్వహిస్తున్నారని జ్యోతిర్మయి ఆరోపించారు. పలుసార్లు గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను ప్రజాదర్బార్‌లో కలిసి సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని విన్నవించారు.

ఐటీ ఉద్యోగాల పేరుతో మోసం

ఒంగోలుక్రైం,జనవరి27(ఆంధ్రజ్యోతి): ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామని 10 మంది వద్ద రూ. 30 లక్షలు తీసుకొని మోసం చేసిన మహిళపై ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఎస్పీని కలిసిన బాధితులు తమ ఫిర్యాదును అందించారు. తమ వద్ద నగదు తీసుకొని బెంగళూరులో ఫేక్ కంపెనీకి పంపించి మోసం చేసిందని, తిరిగి తమ నగదు ఇవ్వలేదని విన్నవించారు.

● రుణం మంజూరు అయిందని నమ్మబలికి ఆధార్, పాన్‌కార్డు,బ్యాంక్ డిటెయిల్స్ తీసుకొని ఇన్సూరెన్స్ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాలని విడతల వారీగా రూ.77,789 లు ఫోన్ పే చేయించుకొని మోసం చేశారని ఓబాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇలా జిల్లా నలుమూల లనుంచి 76 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు.

వృద్ధురాలి సమస్యను వెంటనే పరిష్కరించండి

అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం



వృద్ధురాలు గోవిందమ్మను కుర్చీలో కూర్చోబెట్టి సమస్యను వింటున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన నల్లూరి గోవిందమ్మఅనే వృద్ధురాలి సమస్యను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో గోవిందమ్మ తన సమస్యను విన్నవించేందుకు వచ్చారు. ఆ వృద్ధురాలిని చూసిన జేసీ వేదికమీదకు ఆహ్వానించి సమస్యను విన్నారు. తన భర్త కోటయ్య 20 ఏళ్ళ క్రితం మృతి చెందారన్నారు. తనకు 25 ఎకరాల భూమి ఉండగా ఇద్దరు అడపిల్లలు ఉన్నారని తెలిపారు. పెద్దమ్మాయికి పది ఎకరాలు, చిన్నమ్మాయికి ఎనిమిది ఎకరాల భూమి ఇచ్చానని తెలిపారు. మిగిలిన 7.50 ఎకరాల భూమిని 1999లో తన తదనంతరం ఇద్దరు కుమార్తెలకు చెందే విధంగా రిజిస్టర్ చేశానని జేసీ దృష్టికి తెచ్చారు. పెద్దకుమార్తె మా గ్రామంలోనే ఉండటంతో ముసలితనంలో చూసుకుంటుందన్న ఉద్దేశంతో ఇంటితో పాటు మరో 25 గదుల స్థలం, ఏడు టేకు దూలాలు ఉన్న కొష్టం స్థలాన్ని మనవడికి రిజిస్ట్రేషన్ చేశానని తెలిపారు. ఆ రెండు స్థలాలతో పాటు తన వద్ద ఉన్న పది సవర్ల బంగారం బ్యాంకులోపెట్టి రుణం తీసుకున్నారని తెలిపారు. తన పొలానికి చెందిన పాసుపుస్తకాన్ని కూడా బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్నారని, ఆ రుణం కూడా చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని గ్రామంలో ఉన్న అల్లుడు వెంకయ్యను అడుగగా తనను దూషించడమే కాకుండా మనమడు రాఘవేంద్ర తనపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టాడని కన్నీరు పెట్టుకున్నారు. పోలీసు కేసు పెట్టినా పట్టించుకోలేదని జేసీ దృష్టికి తెచ్చారు. తన చిన్నకుమార్తెను తనపేరు మీద తీసుకున్న రుణాన్ని బ్యాంకులో కట్టాలని కోరితే మాఇద్దరిపై రిజిస్టర్ చేసిన భూమితో బ్యాంకులో రుణం ఇచ్చానని దూషించి ఇంటికి కూడా రానివ్వలేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇతరుల వద్ద రూ. 3లక్షలు తీసుకొని బ్యాంకులో చెల్లించానని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఇంటి నుంచి వెళ్లగొట్టడమే కాక అనేక ఇబ్బందులు పెడుతున్నారని, న్యాయంచేసి ఆదుకోవాలని గోవిందమ్మ కన్నీరు పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

కార్పొరేషన్ శకటానికి ప్రథమ బహుమతి

● ఉద్యోగులకు మేయర్ అభినందనలు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : 76వ గణతంత్ర వేడుకలలో ఒంగోలు నగరపాలక సంస్థకు శకటానికి ప్రథమ బహుమతి సాధించడం పట్ల మేయర్ గంగాడ సుజాత కార్పొరేషన్ సిబ్బందిని అభినందించారు. సోమవారం కమిషనరు చాంబర్‌లో జరిగిన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పేరుతో శకటం ఏర్పాటు చేయడంతోపాటు, ప్రథమస్థానంలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. అలాగే అందుకోసం కృషి చేసిన కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావును, శానిటరీ అధికారులు, సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులను, ఇతర సిబ్బందిని అభినందించారు. అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్ సిబ్బందిని అభినందిస్తున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకొందాం

● మండల సమావేశంలో ఎంపీపీ



మండల సమావేశంలో విద్యాశాఖకు సంబంధించి వివరాలను తెలుపుతున్న ఎంఈవో రవి

నాగులుప్పలపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకొందామని ఎంపీపీ నలమలపు అంజమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రధానమైన రెవెన్యూ విద్యుత్ అధికారులు సమావేశానికి హాజరుకాక పోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీ సైతం డుమ్మా కొట్టడంపై సభ్యులు ప్రశ్నించారు. తిమ్మసముద్రం గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులమైన తమకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదంటూ సర్పంచ్ కంచర్ల సాల్మన్, ఎంపీటీసీ సభ్యులు రాయపాటి అశోక్ సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీడీవో మహాలక్ష్మి గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు,పథకాలను ప్రజాప్రతినిధులకు తెలియపరచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏవో వెంకట్రావు, ఏపీవో రవి, ఎంఈవో టి.రవి, పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఏఈ వీరాంజనేయులు, హౌసింగ్ ఏఈ హేమలత, వెలుగు ఏపీఎం బత్తుల నరేంద్ర తదితరులు ఆయా శాఖలకు సంబంధించి ప్రగతిని వివరించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్‌పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

ఒంగోలుక్రైం, జనవరి27 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ కాంట్రాక్ పనులు చేసే కట్టా ప్రవీణ్‌కుమార్‌ను కులం పేరుతో దూషించి దాడి చేసిన నగరంలోని 32వ వార్డు కార్పొరేటర్ తాడి కృష్ణలత అమె భర్త వెంకటేష్ , గాజుల సాయిపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్ తాడి కృష్ణలతకు సంబంధించిన బిల్డింగ్ పనులు ప్రవీణ్‌కుమార్ చేశారు అందుకుగాను అతనికి రావాల్సిన డబ్బులు గురించి అడిగేందుకు వెళ్లగా దాడి చేసినట్లు ప్రవీణ్‌కుమార్ ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్సీఎస్టీ అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేశారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణం ప్రమాదకరం

మద్దిపాడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయటం ప్రమాదకరమని మద్దిపాడు పోలీసులు వాహనదారులకు సూచిస్తూ హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. వెల్లంపల్లి, తాళ్లూరు రోడ్‌లో ఉన్న కొలచనకోట, దొడ్డవరం, తెల్లబాడు, తాళ్లూరు మండలాల నుంచి మద్దిపాడు మండలంలోకి వచ్చే వారు గుండ్లాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర యూ టర్న్ తీసుకోవాలని సూచించారు. ఒక వేళ ఎవరైనా రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ప్రతిభా పురస్కారం

నాగులుప్పలపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్లుగా మండల గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో నిబద్ధత, కార్యదీక్షతో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లింగాల లాజర్‌కు ప్రతిభా పురస్కారం లభించింది.గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒంగోలు పోలీస్ పరేడ్ మైదానంలో హౌసింగ్ పీడీ పెరుగు శ్రీనివాస్ లాజర్‌కు పురస్కారం అందించారు.

కవాతు ప్రదర్శనలో పేస్ విద్యార్థులకు ద్వితీయస్థానం

ఒంగోలు విద్య, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన కవాతులో 34(ఏ) బెటాలియన్‌కు చెందిన పేస్ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు.

వీరికి కలెక్టర్ తమీమ్ అన్సారియా,ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ సుబ్బారావు, ఆర్. వీరాంజనేయులు తదితరులు అభినందించారు.

అవీ..ఇవీ



ప్రశంసాపత్రాలు అందుకున్న ఉద్యోగులను అభినందిస్తున్న వీసీ మూర్తి

ఉద్యోగులను అభినందించిన వీసీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్న ఉద్యోగులను ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డీవీఆర్ మూర్తి అభినందించారు. స్థానిక యూనివర్శిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు అందుకున్న యూనివర్శిటీ ప్రిన్సిపాల్ జి. రాజమోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్‌లను అభినందించారు. రానున్న రోజుల్లో ఇంకా అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రశంసాపత్రాలు పొందిన ఉద్యోగులను రిజిస్ట్రార్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. నిర్మలా మణి, డీన్ సోమశేఖర్, డాక్టర్ కేవీఎస్ రాజు, డాక్టర్ అంచుల భారతీదేవి, డాక్టర్ పిల్లి వెంకట్రావుతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వెలుగు వీవోఏలు

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వెలుగులో పనిచేస్తున్న వీవోఏలకు కాలపరిమితి విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ వీవోఏలకు కాలపరిమితి విధించడం వల్ల ఉద్యోగ నిర్వహణ ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాశీరత్నం, లక్ష్మీ మాధవి, తెహరా, ఏపీ ఆర్‌పీఏ జిల్లాఅధ్యక్షుడు జి.శేషయ్య తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

నాగులుప్పలపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని డీపీఎం జిల్లా ప్రోగ్రాం మేనేజరు వి.సుభాషిణి సూచించారు. ఐటీసీ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర జీవితాన్ని అందించాలన్నా,పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నా రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధచూపాల్సిన అవసరం ఉందన్నారు.కషాయాలు తయారు చేసుకొనే విధానాలను వివరించారు.

బ్రిలియంట్‌కు ఉత్తమ సేవా అవార్డు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ చైర్మన్ డాక్టర్ షేక్ న్యామతుల్లా తనయుడు ఆ సంస్థ డైరెక్టర్ అఖిల్ అవార్డును అందుకున్నారు. కంప్యూటర్ శిక్షణలో అందించిన సేవలకు గాను కలెక్టర్ అన్సారియా, ఎస్పీ ఎఆర్ దామోదర్, జేసీ గోపాలకృష్ణ నుంచి అవార్డును అందుకున్నారు.

రాష్ట్ర అతిథులుగా హైకోర్టు రిటైర్డ్ సీజేలు

● ఐదు రోజుల పాటు ప్రొటోకాల్ అమలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన మాజీ ప్రధాన న్యాయమూర్తులను రాష్ట్ర అతిథులుగా గుర్తింపు ఇస్తూ, వారికి ప్రొటోకాల్‌ను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న సందర్భంలో వారిని రాష్ట్ర అతిథులుగా పరిగణిస్తుంది. వీరితో పాటు రిటైర్డ్ మాజీ సీజేలకు అదే గుర్తింపు ఇవ్వనుంది. ఏపీలో పర్యటిస్తున్న సమయంలో వారికి ఐదు రోజుల పాటు అతిథులుగా గుర్తింపు ఉంటుంది. రాష్ట్ర అతిథులకు ఇచ్చే అన్ని రకాల ప్రొటోకాల్ వారికి అమల్లోకి వస్తాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం సూచించింది.

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా రవి సుభాష్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కంట్రోల్ (ఔషధ నియంత్రణ) అడ్మినిస్ట్రేషన్ డీజీగా పట్టంశెట్టి రవి సుభాష్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవి సుభాష్ ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం



కరుణానిధి (అధ్యక్షుడు



ప్రభాకర్ (కార్యదర్శి)

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఒంగోలులో జరిగిన సమాఖ్య జిల్లా మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఆర్. కరుణానిధి, ప్రధాన కార్యదర్శిగా పి. ప్రభాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. రాంబాబులను ఎన్నుకున్నారు. కాగా మహాసభలో చేసిన తీర్మానాలను సోమవారం పత్రికలకు విడుదల చేశారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎన్‌జీవో సంఘం నాయకులు

కలెక్టర్ అన్సారియాకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఎలక్టోరల్ అవార్డును అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఘనంగా సత్కరించారు. ఏపీ ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్‌బాబు, ఆర్ సీహెచ్ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అవార్డును అందుకున్న కలెక్టర్‌ను శాలువతో సత్కరించి మొక్కను అందజేశారు. మహిళా ఉద్యోగులకు కలెక్టరేట్‌లోని వెయిటింగ్ హాల్‌ను కేటాయించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, కె. శివకుమార్, తోట శ్రీనివాస్, పి. రామాంజనేయులు, చిరంజీవి, కృష్ణకిషోర్, విజయ్‌కుమార్, కొత్తపల్లి మంజేష్, మహిళా విభాగం చైర్‌పర్సన్ కె. కోటేశ్వరమ్మ, జిల్లాకన్వీనర్ సీహెచ్ శిరీష, జ్యోతి, పద్మజ, తులసి తదితరులు ఉన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీస్ అధికారులతో ఎస్పీ దామోదర్

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించిన పోలీసు అధికారులకు ప్రశంసలు

ఒంగోలుక్రైం, జనవరి27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2024 లో పటిష్ట బందోబస్తుతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పనిచేసిన పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఎక్సలెన్స్ ఇన్ కండక్టింగ్ ఎలక్షన్‌అండ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ అవార్డు అందుకున్న సీఐ సూర్యనారయణ, ఎలక్షన్ సెల్‌లో పనిచేసిన ముండ్లమూరు ఎస్సై నాగరాజు, మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లుతో పాటుగా 15 మంది పోలీసులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

కొత్త మార్పులను గమనించాలి

● త్వరలో ఈపీఎఫ్ ఏటీఎం కార్డులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ తీసుకువచ్చిన మార్పులను ఉద్యోగులు, యజమాన్యం, పెన్షనర్లు గమనించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ బీటీ సతీష్‌కుమార్ సూచించారు. ఉద్యోగుల భవిష్యనిధి డబ్బులు ఏటీఎం ద్వారా డ్రా చేసుకొనేందుకు పెన్షనర్లకు త్వరలో ఈపీఎఫ్ ఏటీఎం కార్డులు జారీ చేయనుందన్నారు. స్థానిక నిధి ఆప్‌కే నిఖత్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి పీడీసీసీ బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వై. బిందు ప్రత్యూష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ సమ్మయ్య పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలను ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు యూనియన్ కార్యదర్శి పీవీ సుబ్బయ్య, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ బి. అనిత, ఎం. వెంకట కృష్ణారావు తదితరులు ఉన్నారు.

తెల్లబాడులో పొగాకు బ్యారన్ దగ్ధం

మద్దిపాడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని తెల్లబాడులో పొగాకు బ్యారన్ దగ్ధం అయ్యింది. బ్యారన్‌లో కర్ర ప్రమాదవశాత్తు పొగ గొట్టంపై పడి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పొగాకు రైతు ఉన్నం కోటేశ్వరరావు మంటలు నిరోధించేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో ఒంగోలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతోపాటు గ్రామస్థుల సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ సంఘటనలో దాదాపు రూ.5 లక్షల మేరక ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. పొగాకు బోర్డు అధికారులు స్పందించి పరిహారం అందజేయాలని కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఉపకరణాల కోసం 120 మంది నమోదు

కొండపి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉపకరణాల అవసరాన్ని గుర్తించేందుకు సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 120 మంది దివ్యాంగులు, వయోవృద్ధుల పేర్లు నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ఎంపీడీవో కార్యాలయ ఏవో పి.రామకృష్ణ, ఎంఈవో పి.రామారావు, సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

సింగరాయకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీఎన్‌సీపీ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎన్.గీతారాణి సూచించారు. స్థానిక స్మార్ట్‌జెన్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన వీడ్కోలు వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని తెలిపారు. కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే ఐఐటీ, నీట్‌లో మంచి ర్యాంకులు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పర్యవేక్షకుడు మసూద్‌కి సత్కారం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్న ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్ అలీని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్యకృష్ణ, వంశీధర్, లీనారాఫెల్, ధీరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి నిర్మాణ పనులు

- కూటమి ప్రభుత్వ చొరవతో గ్రామీణ రోడ్లకు మహర్దశ
- మండలంలో రూ.3.5కోట్లతో పూర్తి చేసుకుంటున్న రోడ్లు

కొమరోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ గ్రామీణ రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. రూ.3.5 కోట్లతో మండలంలో పలు రోడ్లను సీసీ రోడ్లగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రహదారి మరమ్మతు


రోడ్లకు కొనసాగుతున్న క్యూరింగ్ పనులు

పనులు పూర్తి చేయగా, ప్రస్తుతం వేస్తున్న కొత్తరోడ్లు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి.

గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోని ఐదేళ్లలో ఎక్కడా కొత్తగా రోడ్లు వేసిన దాఖలాలు లేవు. దీంతో నాడు పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.70లక్షలతో మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లలోని గుంతలను పూడ్చేందుకు నిధులను మంజూరు చేసింది. పనులను కూడా త్వరగా పూర్తి చేయించారు. దీనికి తోడు ప్రస్తుతం పలుచోట్ల నూతన రహదారులను నిర్మిస్తున్నారు. కొమరోలు నుంచి రాజుపాలెం వరకు డబుల్ రోడ్డును గత టీడీపీ హయాంలోనే నిర్మించారు, రాజుపాలెం నుంచి గిద్దలూరు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణాన్ని కూడా త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొమరోలు పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ. 1.70 కోట్లను ఖర్చుచేసి పురుషోత్తంపల్లి రోడ్డు, కరెంటు ఆఫీసు నుంచి గోపాలునిపల్లికి రోడ్లు నిర్మించారు. ఇక కొమరోలు పట్టణానికి అవుటర్ రింగ్‌రోడ్డు మాదిరిగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కరెంటు ఆఫీసు రోడ్డు నుంచి గోపాలునిపల్లిలోని రెడ్డిచర్ల ఆర్ బీ రోడ్డును 470మీటర్ల దూరంతో 6 మీటర్ల వెడల్పుతో అవుటర్ రింగ్‌రోడ్డును తలపించేలా రూ.75లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వెచ్చి రోడ్లు అనుసందానం చేశారు. ఇక గోపాలునిపల్లి నుంచి శింగరపల్లి వరకు, పురుషోత్తంపల్లి రోడ్డు నుంచి చెరువు కట్టమీదుగా చింతలపల్లి రోడ్డు వరకు అదే రోడ్డును రానున్న రోజుల్లో కొనసాగించనున్నారు. ఇదే జరుగుదే కొమరోలుకు అవటర్ రింగ్ రోడ్డు ఏర్పాటైనట్లేనని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న మినీస్టేడియం, బీసీ భవనం, కాపు భవణం, మాజీ సైనికుల కార్యాలయాలు వంటివి పూర్తిచేయడం, సైనికుల విశ్వవిద్యాలయాలను నిరుద్యోగులకు అవసరమైన పరిశ్రమలను కొమరోలు మండలంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేయడాన్ని పలువురు హర్షిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత మండలం కొమరోలు కావడం మండల అభివద్ధిపై ఆయన కూడా ప్రత్యేకంగా దృష్టిసారించడంతో మండలం అభివృద్ధిపై పయనిస్తోంది.


కొమరోలులో కొత్తగా వేస్తున్న నూతన రహదారి

గిద్దలూరు ఆర్‌టీసీ డిపో అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హామీ

గిద్దలూరు టౌన్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలో వెనుకబడ్డ గిద్దలూరు ఆర్‌టీసీ బస్సు డిపో అభివృద్ధికి కృషిచేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌టీసీ బస్సు డిపోలో సోమవారం డిపోకు నూతనంగా మంజూరైన 5 బస్సులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా నూతన బస్సులకు పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు డిపోలో గతంలో పాడుబడిన బస్సులు ఉండి ఆర్‌టీసీ సిబ్బంది ఇబ్బందులు పడేవారన్నారు. ఈ విషయం తెలుసుకొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన బస్సులను విరివిగా అందజేస్తూ, ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకొంటోందన్నారు. 1977లో గిద్దలూరు ఆర్‌టీసీ డిపోను ఏర్పాటుచేశారని, అప్పటి నుంచి గిద్దలూరు డిపో జిల్లాలో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రెండవసారి ఐదు నూతన బస్సులను ప్రారంభించడం సంతోషమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో గిద్దలూరు డిపోను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిపోలోని యునియన్ నాయకులు, డిపో మేనేజర్ సహకారంతో ముందుకు పోతామన్నారు. గత ప్రభుత్వం ఏపీఎస్ఆర్ టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల సమస్యలను గాలికొదిలేశారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో ప్రతి ఉద్యోగికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యాక్రమంలో గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసుదన్‌యాదవ్, డిపో మేనేజర్ బత్తుల చంద్రశేఖర్, గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాసు, ఎంఆర్ఐ ఆంజనేయరెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షానెషావలి, కౌన్సిలర్లు , టీడీపీ నాయకులు, ఆర్‌టీసీ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నూతన బస్సును ప్రారంభిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గురుప్రసాద్‌కు ప్రతిభ పురస్కారం

కొమరోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజనీరు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గురుప్రసాదుకు జిల్లా ఉత్తమ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా వర్రా గురుప్రసాదుకు ఒంగోలు పోలీసు పేరెడ్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎస్పీ దామోదర్‌ల చేతులమీదుగా అవార్డును తీసుకున్నారు. పోలీసు శాఖలో కొమరోలు పోలీసు స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు జిల్లా ఉత్తమ కానిస్టేబుల్‌గా శివరాం, బ్రాహ్మణపల్లిలో పనిచేస్తున్న సర్వేయర్‌కు జిల్లా ఉత్తమ సర్వేయర్‌గా షేక్ జమాల్ వలికి, అల్లీనగరం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న సబార్డినేట్ అశ్విని అవార్డులు తీసుకున్నారు.


పురస్కారం అందుకుంటున్న గురుప్రసాద్

'ఉల్లాస్' అక్షరాస్యతపై అవగాహన

త్రిపురాంతకం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వెలుగు ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సదర్బంగా ఎంఈవో మల్లిఖార్జుననాయక్ మాట్లాడుతూ ఉల్లాస్‌లో భాగంగా పదిమందికి చదువు నేర్పించడం వలంటీర్లు అదృష్ట ంగా భావించాలన్నారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అనంతరం ఉల్లాస్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రిబ్కా, ఏసీ దానం, వయోజన విద్య సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం ఎడ్వర్డ్, సీసీ ఆంజనేయులు, జ్యోతి పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం అక్రమ అమ్మకాలు

- విదేశీ, డిఫెన్స్ మద్యం విచ్చలవిడిగా విక్రయం
- నిఘా పెంచని ఎక్సైజ్ అధికారులు

మార్కాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విదేశీ, డిఫెన్స్ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ధరల కంటే తక్కువకే పలు రకాల బ్రాండ్లు అందుబాటులో ఉండటం, ప్రియమైన విదేశీ మద్యం కూడా సరసరమైన ధరకు దొరుకుతుండటంతో మద్యం ప్రియులు వాటివైపే మొగ్గుచూపుతున్నారు. అంతేకాక ఫోన్ చేస్తే ఇంటి వద్దకే మద్యం సరఫరా చేస్తుండడంతో అక్రమ మద్యం ఏరులై పారుతోంది. దీంతో ఈ వ్యాపారం నిర్వహించే వారికి 'మూడు పుల్లులు, ఆరు క్వార్టర్లు'గా వర్ధిలుతోంది. అక్రమంగా నిర్వహిస్తున్న ఇలాంటి వ్యాపారంపై దృష్టిసారించి కట్టడి చేయాల్సిన స్థానిక ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. స్థానిక ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒంగోలుకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ వ్యాపారంపై దృష్టిపెట్టి పట్టణంలో శనివారం రాత్రి ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద డిఫెన్స్‌తోపాటు విదేశీ మద్యం కూడా దొరికింది. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న వారి నుంచి కొందరు కిందిస్థాయి సిబ్బంది చేతులు తడుపుకోవడంతోనే ఈ తంతు నిర్విరామంగా సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫోన్ కొడితే ఇంటి వద్దకే సరఫరా

పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన వాళ్లు కొందరు గిద్దలూరు ప్రాంతం నుంచి డిఫెన్స్ మద్యం భారీగా తెప్పిన్నారు. గిద్దలూరు, కంభం పట్టణాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి నుంచి మద్యం మార్కాపురానికి తరలిస్తున్నట్లు సమాచారం. గిద్దలూరు నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఆర్మీలో పనిచేస్తున్న వాళ్లు ఉన్నారు. అంతేకాక గిద్దలూరు పట్టణంలో క్యాంటీన్ కూడా ఉంది. అక్కడ కొందరు మద్యం సేవించని వారి నుంచి బాటిళ్ల కొనుగోలు చేసి వాటిని మార్కాపురంలోని మద్యం వ్యాపారులకు చేరుస్తున్నారు. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కాపురంలో రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ఒక్క మార్కాపురంలోనే రోజుకు సుమారు 200 సీసాల డిఫెన్స్ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయంటే వారి ఆదాయం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. డిఫెన్స్ మద్యమే కాక మరి కొందరు ఇంకో అడుగు ముందుకు వేసి విదేశీ మద్యం విక్రయాలు కూడా చేస్తున్నారు. గతంతో పోల్చితే విదేశాల్లో స్థిరపడ్డవాళ్లు చాలా మందే ఉన్నారు. అంతేకాక విహారయాత్రలకు విదేశాలకు వెళ్లే వాళ్లు కూడా ఉన్నారు. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చే వారిని గుర్తించి వారి వద్ద నుంచి విదేశీ మద్యం కొందరు కొనుగోలు చేస్తున్నారు. వాటిని రెట్టింపు ధరలకు ఇక్కడ అవసరార్థులైన మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. స్థానిక అధికారుల ఉదాసీనతతోనే ఈ తతంగం నిర్విరామంగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

గిద్దలూరులో కుక్కల బెడద


నల్లబండ బజారులో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గిద్దలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నిన్నమొన్నటి వరకు కోతుల బెడదతో సతమతమవుతున్న పట్టణ ప్రజలు తాజాగా కుక్కల బెడదతో ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు సుమారు 100 వరకు కోతులను పట్టుకుని నల్లమల అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. ఇంకా చాలా కోతులు పట్టణంలో స్వైరవిహారం చేస్తూనే ఉన్నాయి. దీనికితోడు ఇటీవల కాలంలో కుక్కల బెడద కూడా ఎక్కువైంది. పట్టణంలోని నల్లబండ బజారుతోపాటు శివారు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులను, వృద్దులను కరుస్తున్నాయి. వారం రోజుల్లో నలుగురైదుగురు కుక్కకాటుకు గురై గాయపడి ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఇంజక్షన్లు వేయించుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో కుక్కలను, కోతుల బెడద నుంచి కాపాడాలని, వాటిని పట్టుకుని అడవిలో వదిలివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కార వేదికకు 14 అర్జీలు

మార్కాపురం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 14 వినతులు భూమస్యల పై వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

సీఐ ప్రభాకరరావుకు సన్మానం


సీఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డు పురస్కారాన్ని ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకరరావు కలెక్టర్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనను ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తమసేవలు అందించినందుకు ఆయన్ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వై.పాలెం, పుల్లలచెరువు మండలాల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదరావు, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కాశికుంట తండ సర్పంచ్ ఎంసీహెచ్ మంత్రు నాయక్, సత్యనారయణ గౌడ్, రెంటపల్లి సుబ్బారెడ్డి, వెంకట్రావు గౌడ్, నక్కా రాములు, శనగా వెంకటేశ్వరరెడ్డి, కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువల వెంబడి ఎక్కడి చెత్త అక్కడే

కంభం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కంభం చెరువు ప్రధాన పంట కాలువల్లో ఏర్పడిన పూడిక, చిల్లకంపను తొలగించిన అధికారులు తిరిగి కట్టపైనే మట్టివేయడంతో మరోసారి కాలువలు పూడిపోయే అవకాశం ఉంది. ఇరిగేషన్ కాలువల పరిధిలో కొన్ని తూములకు మరమ్మతు చేసేందుకు ప్రభుత్వం రూ.38లక్షలు మంజూరు చేసింది. దీంతో నెలక్రితం పంట కాలువల్లో ఉన్న పూడికను, చిల్లచెట్లను అధికారులు తొలగించారు. ఆ చెత్తను అలాగే కాలువ గట్లపై ఇరువైపులా వేసి వదిలేశారు. దీంతో పూడిక తిరిగి కాలువలో పడుతోంది. అధికారుల నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎత్తి దూరంగా పడేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాగే రూ.70లక్షలతో కాలువల్లో పూడిక తీయించి అలాగే వదిలివేయడంతో తిరిగి చెత్తపడి పూడిపో యిందని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువగట్లపై ఉన్న చెత్తను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ ఏఈ శ్రీనునాయక్‌ను ఈవిషయంపై వివరణ కోరగా ట్రాక్టర్లతో ఆ పూడిక మట్టిని తొలగిస్తామన్నారు.


పూడిక తీసి కాలువ వెంబడి వదిలేసిన వ్యర్థాలు

కొత్త మార్పులను గమనించాలి

- త్వరలో ఈపీఎఫ్ ఏటీఎం కార్డులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ తీసుకువచ్చిన మార్పులను ఉద్యోగులు, యజమాన్యం, పెన్షనర్లు గమనించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ బీటీ సతీష్‌కుమార్ సూచించారు. ఉద్యోగుల భవిష్యనిధి డబ్బులు ఏటీఎం ద్వారా డ్రా చేసుకొనేందుకు పెన్షనర్లకు త్వరలో ఈపీఎఫ్ ఏటీఎం కార్డులు జారీ చేయనుందన్నారు. స్థానిక నిధి ఆప్‌కే నిఖత్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి పీడీసీసీ బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వై. బిందు ప్రత్యూష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ సమ్మయ్య పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలను ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు యూనియన్ కార్యదర్శి పీవీ సుబ్బయ్య, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి. అనితా, ఎం. వెంకట కృష్ణారావు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- పట్టించుకోని అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

కంభం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రజా ఆస్తులపై నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని చెప్పడానికి శిథిలావస్థ భవనాలు సాక్షంగా కనిపిస్తున్నాయి. మండలంలో అనేక ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూలేందుకు సిద్దంగా ఉన్న భవనాల్లోనే కార్యకలాపాలు సాగించే దుస్థితి లేకపోలేదు. మరికొన్ని భవనాలను అలాగే ఎందుకు పనికిరాకుండా వదిలివేశారు. ప్రజాఆస్తులపై అధికారుల వైఖరి ఎత్తి చూపుతోంది. అటవీశాఖ, పాలకేంద్రం, విద్యుత్ వసతి గృహాలు, టెలిఫోన్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కంభం, కందులాపురం నడిబొడ్డున ఉన్న అటవీశాఖ కార్యాలయం చుట్టూ చెట్లు పెరిగాయి. చుట్టుపక్కల వారు గేదెలను కట్టివేస్తున్నారు. 1992లో గిద్దలూరు డివిజన్ అటవీ శాఖ అధికారి ఎస్.ఎం.సెల్వరాజ్ ఈ భవనాన్ని ప్రారంభించారు. నామమాత్రంగా మూడేళ్లపాటు అధికారులు ఇక్కడ ఉన్నారు. అనంతరం తురిమెళ్ల గ్రామాన్ని విధుల నిర్వహణకు ఎంపిక చేసుకున్నారు. దీనితో ఆశాఖ కార్యాలయ భవనాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు.

- కంభం 133/11 కెవి విద్యుత్ సిబ్బంది నివాస గృహాలు, పాలకేంద్ర సిబ్బంది నివాస గృహాలు, టెలిఫోన్ కార్యాలయ భవనం 25 ఏళ్లగా నిరుపయోగంగా ఉంది. దీంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ ప్రైవేటు భవనాల్లో అద్దెలు కడుతూ నిర్వహిస్తున్నారు. వెలుగు కార్యాలయానికి సొంత భవనం లేక అద్దెలు చెల్లిస్తూ నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టి అద్దెలు కడుతున్న కార్యాలయాలను వీటిలోకి మారిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.




శిథిలావస్థలో ఉన్న అటవీశాఖ కార్యాలయం, విద్యుత్ సిబ్బంది క్వార్టర్స్, చిల్లచెట్ల మధ్య ఉన్న పాలకేంద్రం క్వార్టర్స్

అవీ..ఇవీ

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీమెటీరియల్ అందజేస్తున్న చిన్ని సేవాసంస్థ ప్రతినిధులు

గిద్దలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిన్ని సేవాసంస్థ స్టడీ మెటీరియల్ అందజేసింది. ఈ మెటీరియల్ ద్వారా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించేందుకు అవకాశం ఉందని, సమయాన్ని వృథా చేసుకోకుండా మెటీరియల్ చదువుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఆయా కార్యక్రమాలలో సంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు సుధాకర్, మెరీకుమారి, మాలకొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కంభం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలను అలింకో సంస్థ ద్వారా ఈనెల 29న బుధవారం ఉచితంగా ఇస్తున్నట్లు కంభం, అర్ధవీడు ఎంపీడీవోలు వీరభద్రచారి, నరసయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థ దివ్యాంగులకు చేతికర్రలు, సంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, 3 చక్రాల సైకిళ్లు, అంధుల చేతికర్రలు, బ్యాటరీ సైకిళ్లు, రోల్‌టైర్స్ తదితర ఉపకరణాలు అవసరమైన వారికి గిద్దలూరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో, పీఆర్‌కాలనీ నందు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున అర్హత ఉన్న దివ్యాంగులు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుదన్నారు. వచ్చే వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్ 2 ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, యూఐడీ కార్డు మొబైల్ నంబరుతో హాజరు కావాలన్నారు.

చిత్రపటం అందజేత

గిద్దలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలోని విద్వాన్ పాఠశాలకు తొలినాటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి అందజేశారు. నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని గిద్దలూరులో భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నందున నరసింహారెడ్డి చరిత్రను గురించి ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా చిత్రపటాలను అందచేస్తున్నట్లు నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విద్వాన్ స్కూల్ వ్యవస్థాపకులు పాండురంగారెడ్డి, చిన్నసేవా సంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

డీప్‌బోరు మోటార్లకు మరమ్మతులు


మరమ్మతులు చేసిన మోటార్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మార్కాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ వార్డు పరిధిలో పలు చోట్ల డీప్‌బోరు మోటార్లు కాలిపోయాయి. దీంతో డీప్ బోర్ల ద్వారా నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ పఠాన్ నాగూర్‌ఖాన్ ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మోటార్లకు మరమ్మతులు చేశారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం వాటిని బిగించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంట కాలువ పనులను పరిశీలన


పంట కాలువలో పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

మార్కాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక 1వ వార్డు పరిధిలో జరుగుతున్న పంట కాలువ అభివృద్ధి పనులను సోమవారం సాగునీటి వినియోగదారుల సంఘం నాయకులు పరిశీలించారు. ఈ నెల 24వ తేదీన 1వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి పంట కాలువను అభివృద్ధి చేయాలని వార్డు ప్రజలు కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి అభివృద్ధి పనులు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గత రెండు రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. చాలాచోట్ల కాలవ ఆక్రమణకు గురైనట్లు నీటి సంఘం అధ్యక్షులు దగ్గుల శ్రీనివాసరెడ్డి గుర్తించారు. ఆక్రమణలను దగ్గరుండి తొలగించి పాత పంటకాలువను యథాతథంగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

పడమటిపల్లిలో ఉచిత వైద్యశిబిరం



గజ్జలకొండలో వైద్య పరీక్షలు చేస్తున్న కృష్ణారెడ్డి

మార్కాపురంరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గజ్జలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడమటిపల్లి గ్రామంలో సోమవారం డాక్టర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు టీబీ, బీపీ, డయాబెటిస్, బీఎంఐ, రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. తరచూ దగ్గు, జ్వరం, బరువు తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుడిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పెద్దన్న, వైద్య సిబ్బంది సురేష్ బాబు, శిరీష కుమారి, సంధ్య మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

నాగులుప్పలపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని డీపీఎం జిల్లా ప్రోగ్రాం మేనేజరు వి.సుభాషిణి సూచించారు. ఐటీసీ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర జీవితాన్ని అందించాలన్నా, పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నా రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధచూపాల్సిన అవసరం ఉందన్నారు.

ఇనిమెర్ల గ్రామస్థునికి సాయం అందజేత

పామూరు, జనవరి 27 : మండలంలోని ఇనిమెర్ల గ్రామానికి చెందిన గాలంకి కొండయ్య అనారోగ్యంతో వైద్యం సహాయం కోసం ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకొన్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున రూ.5 వేల నగదును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం ముసలయ్య, వీ వెంకటేశ్వరరెడ్డి, టీ రమేష్, పీ తిరుపతిరెడ్డి, టీ వెంకటేశ్వరరావు, కే నాగేశ్వరరావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విజేత ఐఐటీ అండ్ నీట్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు రెండు రోజుల పాటు మెగా టాలెంట్ టెస్ట్‌లు స్థానిక విజేత కళాశాలలో నిర్వహించారు. ఈటాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.7వేలను జీ ఏడుకొండలు, రెండో బహుమతి రూ.5వేలను ఎస్ వివేకానంద, మూడో బహుమతి రూ.3వేలను టీ గోవర్ధన్‌రెడ్డిలకు అందజేశారు. అదేవిధంగా కార్తీక్, ఆనంద్‌లు చతుర్థ, పంచమి బహుమతులు పొందగా, శ్రావ్య, నందిని, అశ్విని, యశ్వంత్, మౌనిక, ఎన్ తేజ, ప్రతిభ, మహేశ్వరి, మణి, కళావతిలకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలను కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్, ప్రిన్సిపల్ వేముల శ్రీరాములు, డైరెక్టర్ మాధవరావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ రికార్డులను పరిశీలించిన అధికారులు


జొన్న పైరును పరిశీలిస్తున్న ఏడీఏ రమణ

పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : మండలంలో తిరగలదిన్నె, మోపాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, సిద్ధవరం గ్రామాల్లో 2024-25 రబీ సీజన్ పంటలను ఈ క్రాప్ చేసిన రికార్డులను కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఈవీ రమణ సోమవారం తనిఖీ చేశారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీ చేయించుకుంటేనే నష్టపరిహారం వస్తుందని చెప్పారు. అనంతరం జొన్న పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో కే రాధ, ఏఈవో నాగేష్, వీఏఏలు కల్యాణ్, సంతోష్, బాలకృష్ణ, రమేష్, హరికృష్ణలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1,18,580

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : మండలంలోని కోవిలంపాడు గ్రామంలో మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,18,580 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.41,340, లడ్డు ప్రసాదం ద్వారా రూ.22,760, అన్నదానం విరాళాల ద్వారా రూ.54,480 ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : పశువులకు, జీవాలకు వ్యాధులు దరిచేరకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలను ప్రభుత్వం ఉచితంగా వేయిస్తోందని డీజీపేట పశువైద్యాధికారి షేక్ మునీర్ చెప్పారు. మండలంలోని పెదరాజుపాలెంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 38,686 గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ, 12 గేదెలకు చూడిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, ఎన్డీయే కూటమి నాయకులు రామకృష్ణంరాజు, ధనేంకుల మాలకొండయ్య, నాగరాజు, దర్శి ఆదినారాయణ, పశువైద్య సహాయకులు వెంకటేశ్వర్లు, శివనారాయణ, నూర్జహాన్, వినీత్‌బాబు, నవీన్, హనుమంత్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : మండలంలోని అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం ఉచితంగా అందజేశారు. దాతలు మాదినేని శ్రీనివాసులు సహకారం అభినందనీయమని హెచ్‌ఎం జీ సుప్రజ చెప్పారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే పాదుషా, కోశాధికారి కె. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు హస్తి వీరాంజనేయులు, ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి పీసీపల్లిలో సీసీరోడ్లు ప్రారంభం


సీసీరోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి రూ.1.48కోట్లతో పీసీపల్లిలో నిర్మించిన పలు సీసీరోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ప్రజలతో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఘటికుడు అని కొనియాడారు. రూ.35లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) వరకు నిర్మించిన సీసీరోడ్డును మంత్రి ప్రారంభించారు. ఆ తర్వాత వసతుల గురించి కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆ తర్వాత పీసీపల్లి బ్యాంకు సెంటరు వద్ద 87లక్షల రూపాయలతో నిర్మించిన ప్రధానరోడ్డు, సచివాలయాల రోడ్డును ప్రారంభించారు. అనంతరం 26లక్షల రూపాయలతో కమ్మవారిపల్లిలో నిర్మించిన సీసీరోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, తహసీల్దార్ ఉష, పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్య, తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు బలరాంరెడ్డి, టీడీపీ నాయకులు పువ్వాడి నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చాగంరెడ్డి మాలకొండయ్య(మాజీ), వెంగళాయపల్లి, నేరేడుపల్లి, గుదేవారిపాలెం, తలకొండపాడు సర్పంచ్‌లు కరణం తిరుపతయ్య, పల్లా మల్లికార్జున, కనపర్తి శాంసన్, ముప్పూరి తిరుపతమ్మ, వీరపనేని పెద్దన్న, ములకా నాగేశ్వరరావు, వేమూరి సుబ్బారావు, నాగోతు శ్రీనివాసులు, పరిమి ఈశ్వరరావు, ప్రసాదు, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంఘీక-సంక్షేమశాఖ, గ్రామా వార్డు సచివాలయాలశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు సోమవారం మండలంలోని వెంగళాపురం సమీపంలో ఉన్న గంగాభవానిని దర్శించుకున్నారు. పీసీపల్లిలో సీసీరోడ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన వారు తొలుత గంగమ్మ గుడికి వెళ్లారు. అక్కడ ఆలయ పూజారులు మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్రలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు గంగాభవాని మూలవిరాట్‌ను దర్శించుకుని ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారిని దర్శనానంతరం ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును పరిశీలించారు.

మంత్రిని కలిసిన పామూరు శ్రేణులు

పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : కనిగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల ఆంజనేయస్వామిని పామూరు టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, సర్పంచ్ కొండబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ సామాజిక భవనం మంజూరు చేయాలని వినతి

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి డివిజన్ స్థాయిలో అంబేద్కర్ సామాజిక భవనం నిర్మాణం చేపట్టాలని జైభీం దళిత బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సూరే రాజన్నమాల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమక్షంలో మంత్రి స్వామిని కోరారు. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి శ్రీడోలా బాలవీరాంజనేయస్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, పట్టణ టీడీపీ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు బుల్లా బాలబాబు, కరాటపు మోజెస్, కరాటపు జేమ్స్, మాసిపోగు యర్రయ్యలు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర స్ఫూర్తితో తాను రాజకీయాల్లోకి వచ్చానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. లోకేష్ పాదయాత్ర పూర్తి చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు తెచ్చిందన్నారు. యువతలో ఎంతో స్ఫూర్తిని పెంపొందించటంతోపాటు టీడీపీ కూటమి అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిందని చెప్పారు. పాదయాత్ర సమయంలో వైసీపీ ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించినా లెక్కచేయక వైసీపీ పాలకుల అరాచకాలను ప్రజలకు వివరించి వారికి చరమగీతం పాడటంలో లోకేష్ పాత్ర కీలకమన్నారు.

దివ్యాంగులకు ఈనెల 31న ఉచిత వైద్యశిబిరం

నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఈనెల 31వ తేదీన దర్శిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. ఎన్‌కో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరీక్షలు చేపట్టి వారి అవసరాలను గుర్తిస్తామన్నారు. అనంతరం 15 రోజుల్లోపు దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలను తయారు చేయించి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, నేతలు పుల్లలచెరువు చిన్నా, నారపుశెట్టి మధు, మారెళ్ల వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ, నాగులపాటి శివకోటేశ్వరరావు, నెమలయ్య, మోడి వెంకటేశ్వర్లు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు ఒకేసారి రెండు అవార్డులు



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్(ఫైల్)

దర్శి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దర్శి తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్‌కు ఒకేసారి రెండు ఉత్తమ అవార్డులు లభించాయి. ఆయన ఎక్కడ పనిచేసినా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నందున తగిన గుర్తింపు లభించింది. గత ఎన్నికల్లో శ్రావణ్‌కుమార్ బాపట్ల తహసీల్దార్‌గా, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహించారు. అక్కడ అతి తక్కువ ఖర్చుతో సమర్థంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించటంలో కీలకపాత్ర పోషించారు. ఆ విషయాన్ని గుర్తించిన ఎన్నికల సంఘం ఆయన్ను ఉత్తమ ఏఈఆర్‌వోగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 25వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్, రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ ఏఈఆర్‌వో అవార్డు అందుకున్నారు. ఎన్నికల అనంతరం ఆయన దర్శి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. రెవెన్యూ విధులను సమర్థంగా నిర్వహించటం, పెండింగ్ ఫైళ్లు వేగవంతంగా పరిష్కరించటం, ఎలక్ట్రోల్ కార్యక్రమాల్లో భాగంగా ఓట్ల చేర్పులు, మార్పుల విషయాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా నిర్వహించిన విషయాలను గుర్తించి ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ తహశీల్దార్ అవార్డును అందుకున్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు ఈ అరుదైన గౌరవం దక్కటంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్సై శివకు అవార్డు

కురిచేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని పలువురు అధికారులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సత్కరించారు. కురిచేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివను ఎస్పీ దామోదర్ జ్ఞాపికతో సత్కరించారు. అలాగే కానిస్టేబుల్ సునీల్‌రత్నకుమార్, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె ఆరోన్‌బాబును కలెక్టర్ సత్కరించారు. వారిని ఆయా శాఖల కార్యాలయాలలో సోమవారం సిబ్బంది అభినందించారు.


ఎస్ఐ శివను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

పాపిరెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని పొదిలిరోడ్డులో ఉన్న సూరా పాపిరెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జోసఫ్ దానియేలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో వీధిలైట్లు వెలగకపోవటంతో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోయారు. సాగర్‌నీటి పైపులైను కాలనీ వద్ద రోడ్డు వెంబడి వెళ్తుందని, దానినుంచి నీటిని కాలనీవాసులకు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2012లో తమకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని కానీ ఇంతవరకు మౌలిక వసతుల సదుపాయం కల్పించలేదని చెప్పారు. కనిగిరి చెక్‌పోస్టు వద్ద చెరువు అలుగును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఏడుకొండలు, పి చెన్నమ్మ, సామేలు, మధు, సుబ్బమ్మ, సుశీల, మేరీ, గురవయ్య పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రజలు

జనసైనికుల సంబరాలు

కురిచేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి ఎలక్షన్ కమిషన్ గాజు గ్లాసును కేటాయించడం పట్ల మండల పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. పాత పోలీస్ స్టేషన్ వద్ద వారంతా సంబరాలు చేశారు. అందరికీ గాజు గ్లాసులో కాఫీ, టీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కురిచేడు మండల జనసైనికులు ములకాల సుబ్బారావు, పసుపులేటి సుబ్బారావు, కురంగి చంద్రబాబు, అయ్యప్ప, షేక్ మీరావలి, మాచారాపు తిరుపతయ్య, షేక్ వలి పాల్గొన్నారు.


గాజు గ్లాసుతో జన సైనికులు

దొనకొండలోని ప్రధాన రహదారిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



కమ్మేసిన పొగమంచు

దొనకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల ప్రతిరోజు తెల్లవారుజామున రహదారులను కమ్మేస్తూ దట్టంగా పొగమంచు కురిసింది. పొగమంచు కురుస్తుండటంతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించకపోవటంతో వాహన చోదకులు భయంభయంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వాకింగ్ వెళ్లే వారు సైతం మంచుకు తోడు చలికూడా ఉధృతంగా ఉండటంతో ఇబ్బందిపడుతున్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

అవీఇవీ



బస్సు ఎత్తులోనే ఉన్న విద్యుత్ తీగ

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే గాని విద్యుత్ శాఖ అధికారులు స్పందించారా అని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలోని ఏకునాంపురం రూట్‌లో విద్యుత్ తీగలు కిందకు వేళాడుతూ ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయి. ఆర్టీసీ బస్సుకు తగిలే ఎత్తులో తీగలు ఉండటంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఆ రోడ్డుపై భారీ వాహనాలకు కరెంటు తీగ తగిలితే ప్రమాదం పొంచి ఉంది. ఆ ముప్పు జరగకముందే విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి కిందకు వేళాడుతున్న తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

మంత్రిని కలిసిన డీసీ చైర్మన్ శ్రీనివాసరావు


మంత్రి గొట్టిపాటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కంచుమాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. తనకు చైర్మన్ పదవి రావటానికి కృషి చేసిన మంత్రి రవికుమార్‌కు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోదేపల్లి మేజర్ పరిధిలో చివరి భూములకు సహితం నీరు అందించేలా పనిచేసి రైతుల మెప్పు పొందాలని శ్రీనివాసరావు కోరారు.

ప్రతి కార్డుదారుడికీ నిత్యావసరాలు అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, హాజరైన రేషన్ డీలర్లు

ముండ్లమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేషన్‌షాపుల డీలర్లు నిత్యావసర సరుకులను అందించటంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి డీలరు సకాలంలో సరుకులకు డీడీలు తీయాలన్నారు. ప్రతి నెలా క్రమంతప్పకుండా కార్డుదారులకు సరుకులు ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు పాల్గొన్నారు.

రజిత తోరణం నిర్మాణానికి కేజీ వెండి విరాళం


చైర్మన్‌కు వెండిని అందజేస్తున్న ముప్పసాని దంపతులు

పామూరు, జనవరి 27 : స్థానిక వాసవి కన్యాకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి గర్భగుడి వాకిలికి రజిత తోరణం నిర్మాణానికి ముప్పసాని క్రిష్ణయ్య కుమారుడు వెంకటేశ్వర్లు దంపతులు లక్ష రూపాయల విలువైన ఒక కేజీ, 10 గ్రాముల వెండిని విరాళంగా దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాల కొండలరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ముప్పసాని వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

సెలవుపై వెళ్లిన పామూరు తహసీల్దార్

ఇక్కట్లు పడుతున్న ప్రజలు


పామూరు తహసీల్దార్ కార్యాలయం


పామూరు, జనవరి 27 : మండల రెవెన్యూ కార్యాలయంలో పదిరోజుల నుంచి తహసీల్దార్ లేక వివిధ పనులపై వచ్చే అర్జీదారులకు పనులు కాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పామూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బీవీ రమణారావు మెడికల్ లీవ్ పెట్టి వెళ్లారు. అయితే ఆ బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. గ్రామ సచివాలయాల్లో ఇన్‌కం, క్యాస్ట్, ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్, భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు తహసీల్దార్ టేబుల్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వారం రోజుల నుంచి అర్జీదారులు కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పామూరుకు తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

దర్శి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రసన్నకుమార్ కోరారు. దర్శిలో సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా 46వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె. విజయ్, మాజీ అధ్యక్షుడు కె. అంజనేయులు, సోమయ్య, దేవరాజు, సాయి, పాండురంగారావు పాల్గొన్నారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా మునెయ్య


మునెయ్య

దొనకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ దొనకొండ మండల నూతన అధ్యక్షుడిగా మండలంలోని మల్లంపేటకు చెందిన మూడమంచు చిన్నమునెయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు చిన్నమునెయ్యకు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి సత్కరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 28 జనవరి 2025



బీఈడీ పరీక్షల ఫీజు తేదీలు మార్పు

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ఫీజు చెల్లించుకునే గడువును మార్పు చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత అభ్యర్థులు ఫీజు చెల్లించుకోవచ్చునని సూచించారు. రూ. 100 అపరాధంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ను సంప్రదించాలని సీఈ సూచించారు.

రెండు నెలల్లో రెండో డీఆర్సీ

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో నేడు డీఆర్సీ సమావేశం

- హాజరుకానున్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఏటీఆర్‌పైనే అందరి దృష్టి
- ధాన్యం సేకరణతో పాటు అభివృద్ధి పనులే అజెండాగా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇన్‌చార్జి మంత్రులు తరచూ జిల్లాల్లో పర్యటించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. నవంబరులో జరిగిన డీఆర్సీలో పలు అంశాలు ప్రస్తావనకు రాగా పనుల పురోగతిని తదుపరి సమావేశం నాటికి చూపెట్టాలని మంత్రులు


ఆరబెట్టిన ధాన్యాన్ని గోతాల్లోకి ఎత్తుతున్న అన్నదాతలు (ఫైల్ ఫొటో)

అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వేదికగా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరగబోయే డీఆర్సీ ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు)కీలకం కానుంది. డీఆర్సీ సమావేశాలకు మధ్య కనీసం ఆరు నెలల కనీస గడువు ఉండడం అనే నిబంధనను పాటిస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వం అయితే ఏడాదికి కూడా డీఆర్సీ సమావేశం జరపకుండా దానిని ఓ ప్రహసనంగా మార్చేసింది. కానీ ఇప్పుడు మూడు నెలల్లోపే రెండో డీఆర్సీ సమావేశం జరుగుతుండడం వెనక ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల బాట పట్టాలనే సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలే పనిచేశాయనేదే సమాచారం.

ఏం చర్యలు తీసుకున్నారు

మంగళవారం జరగబోయే డీఆర్సీ సమావేశంలో గత సమీక్షలో లేవనెత్తిన అంశాలపై ఎలాంటి పురోగతి సాధించారో అనే అంశాన్ని ఏటీఆర్ పేరిట ఆయా విభాగాల అధికారులు సమావేశంలో నివేదించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలో ఏటీఆర్ ఊసే మరచి మొక్కుబడి తంతులా దీనిని నడిపించారు. కానీ గత సమావేశంలోనే ఏటీఆర్ అనేది డీఆర్సీ సమావేశాలకు గీటురాయి వంటిదనే అభిప్రాయాన్ని మంత్రులు వెలిబుచ్చారు. బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం, కాలువల్లో పూడికతీత, కీలకప్రాజెక్టుల్లో కదలిక వంటి అంశాలతో పాటు తుపాన్ సాయం, గ్రానైట్ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు వంటివన్నీ గత సమీక్షలో చర్చకు వచ్చాయి. వీటన్నింటిపై ఆయా విభాగాలు తీసుకున్న చర్యలను యాక్షన్ టేకెన్ రిపోర్టు రూపంలో సమావేశం ముందు వివరించాల్సి ఉంటుంది.

ప్రస్తుత అజెండా ఇదే...

జిల్లాలో ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం పూర్తి కావడంతో మద్దతు ధర విషయంలో రైతాంగం ఇబ్బందులు ఎదు ర్కొంటోంది. బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు ధర మరింతగా పతనమవడం కూడా ఆందోళన పరిచేదిగా ఉంది. ప్రభుత్వానికి 25,000 టన్నుల వరకు అదనంగా ధాన్యం సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపినప్ప టికీ 5,000 టన్నులకే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక దీనితో సరిపెట్టుకోవాల్సిందేననే సంకేతాలను ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పటికీ దాదాపు 70,000 టన్నుల ధాన్యం పొలాల మీదే ఉండడంతో పాటు మిల్లుల్లో కూడా వేల టన్నుల ధాన్యం నిల్వ చేసి ఉండ డంతో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర మీదే అన్నదాతలు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా ఈ అంశమే డీఆర్సీ సమావేశంలో చర్చకు రానుంది. మరోవైపు బాపట్ల మెడికల్ కళాశాల పనుల ప్రారంభం విషయంలో నెలల తరబడి ఎలాంటి చలనం లేకపోవడంతో దాని నిర్మాణంపైన అనేక అపోహలు ప్రజల్లో ఉన్నాయి. ఇది కూడా డీఆర్సీలో ప్రముఖంగా చర్చకు రానుంది. అనేక పనులను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. వాటిని ఓ కొలిక్కి తేవడానికి తీసుకోవాల్సిన చర్యలు కూడా అజెండాలో భాగం కానున్నాయి. రీ సర్వే, రెవెన్యూ సద స్సుల్లో వేల సంఖ్యలో అర్జీలు రావడంతో వాటి పరిష్కారం పారదర్శకంగా జరుగుతుందా లేదా అనే అంశంతో పాటు తాజాగా మండలానికో గ్రామంలో జరుగుతున్న రీ సర్వేపై కూడా సమావేశంలో చర్చించనున్నారు.

పక్కా నివేదికలతో రండి

జిల్లాను అన్ని రంగాల్లో పురోగమన బాట పట్టించాలంటే డీఆర్సీ సమావేశమే అత్యంత కీలకమని గత సమీక్షలోనే ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లా మంత్రులు కూడా అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి పురోగతి నివేదికలతో పాటు, డీఆర్సీలో ఇన్‌చార్జి మంత్రి ఏ అంశం గురించి వివరాలు అడిగినా పక్కాగా ఇచ్చేలా నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆయా విభాగాల అధికారులను ఇప్పటికే కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు.

స్వల్ప వ్యవధిలో పెట్టడంపైనా సర్వత్రా చర్చ...

గతంలో దాదాపుగా ఎప్పుడూ కూడా ఇలా కేవలం మూడు నెలలు కూడా తిరక్కుండానే రెండో సారి డీఆర్సీ సమావేశం జరిగిన దాఖలాలు లేవు. ఏవైనా ప్రత్యేక పరిస్థితులు, అత్యవసర ఎజెండాలు ఉంటే తప్ప ఆరునెలల వ్యవధి అనేది సాధారణంగా ఉంటూ వస్తోంది. కానీ గతేడాది నవంబరు 5నే ఈ ప్రభుత్వంలో తొలి డీఆర్సీ జరగడం, మూడు నెలలు కూడా దాటకముందే మళ్లీ రెండో డీఆర్సీ జరగనుండడంతో నిబంధనలపై కూడా అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఇంత స్వల్ప వ్యవధిలోనే డీఆర్సీ మీటింగ్ జరపడం, జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు

రిసార్ట్ మోసాలపై పోలీసుల గురి




- సూర్యలంక హరిత బీచ్ రీసార్ట్ పేరిట సైబర్ వల
- బాధితుల్లో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే
- రెండు వారాల వ్యవధిలో 8 మంది ఉచ్చులో
- బయటపడని వారు మరెందరో
- నకిలీ వెబ్‌సైట్లపై డీజీపీకి లేఖ రాసిన ఏపీటీడీసీ
- సూర్యలంక రిసార్టు నుంచి వివరాలు తీసుకున్న డీజీపీ ఆఫీస్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకుని రెండు వారాల వ్యవధిలో 8 మంది సైబర్ మోసాల బాధితులుగా మిగిలారు. వీరంతా తెలంగాణవారే కాగా, వారాంతంలో ఆహ్లాదంగా బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సేద తీరాలనుకున్న వారు సైబర్ దొంగలు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిలలా డారు. బాధితులుగా బయటికొచ్చిన వారు 8 మంది కనబడుతుండగా, పదుల సంఖ్యలో ఈ మోసాల బారిన పడి బయటికి చెప్పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల క్రితం ఇదే తరహాలో సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట సైబర్ దొంగలు మోసాలకు పాల్పడ్డారు. అప్పుడు రిసార్టు నిర్వాహకులు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ దశలోనే ఆ కేసు నీరుగారిపోయింది. తర్వాత కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న సైబర్ నేరగాళ్లు మళ్లీ జనవరి నుంచి పర్యాటకులే లక్ష్యంగా, అది కూడా సూర్యలంక హరిత బీచ్ రిసార్టుపైనే ఎక్కువగా గురిపెట్టి పెద్ద ఎత్తున మోసాలకు (మిగతా 6వ పేజీలో)

బాధితుల వివరాలు.. వారు నగదు బదిలీ చేసిన ఖాతాలు..


హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఈ నెల 12న సూర్యలంక హరిత బీచ్ రిసార్టులో గదులు బుక్ చేసుకోగా రూ.7,535 చెల్లించగా అది నకిలీ వెబ్‌సైట్ అని తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను కూడా సేకరించగా అది మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు తేలింది. ఈ వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు నిర్వాహకులకు బాధితుడు అందించారు. ఇదే నెల 14న మరో ముగ్గురు బాధితులు వెలుగులోకి వచ్చారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్ వాసులు కాగా, మరొకరు ఖమ్మం వాసి. వీరు నకిలీ వెబ్‌సైట్‌లో గదులుబుక్ చేసుకుని కుటుంబంతో కలిసి నేరుగా హరిత బీచ్ రిసార్టుకు రాగా మేనేజర్ అలాంటి బుకింగ్‌లేవీ జరగలేదని సమాధానమివ్వడంతో కంగుతినడం వారి వంత యింది. రూ.15,000 వరకు వీరు మోసపోయా రు. వీరంతా కూడా బ్యాంకు ఖాతా వివరా లతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫోన్ నంబరు తదితరాలతో సమగ్రంగా రిసార్టు నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ఏపీటీడీసీకి అందించగా, వాటిని డీజీపీ కార్యాలయంలో అందజేశారు. వాటి ఆధారంగానే విచారణ మొదలుపెట్టిన పోలీసులు తొలుత బ్యాంకు ఖాతా వివరాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. బాధితులు నగదు బదిలీ చేసిన ఖాతాలను బ్లాక్ చేయించే ప్రక్రియ నిబంధనల ప్రకారం ఇప్పటికే మొదలయింది. మరో వారం రోజుల్లో సైబర్ దొంగల ఆట కట్టిస్తామనే ధీమాను పోలీస్ శాఖ వ్యక్తం చేస్తోంది.



హరిత బీచ్ రిసార్టును పోలే విధంగా గదుల చిత్రం డిస్‌ప్లేలో ఫోన్ నంబర్

రూటు మార్చిన ఏపీటీడీసీ

సైబర్ మోసాల బాధితులు ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు ఇవ్వడానికి వెనకాడడం కూడా ఇన్ని రోజులూ సైబర్ దొంగలకు కలిసి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులుగా వచ్చేవారు తాము మోసపోయినట్లు రాత పూర్వకంగా ఫిర్యా దు ఇవ్వడానికి అంగీకారం తెలిపేవారు కా దు. మళ్లీ ఇటీవల వరుసగా సూర్యలంక హరిత బీచ రిసార్టు పేరిట సైబర్ మోసాలు వెలుగుచూడడంతో ఏపీటీడీసీ దృష్టి సారించింది. ప్రభుత్వ సంస్థ పేరుతోనే డీజీపీకి నేరుగా ఫిర్యాదు చేయడంతో సైబర్ దొంగల మూలాలను కూపీలాగే పనిలో పోలీస్ శాఖ ఉంది.



అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలి : కలెక్టర్


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను పరిష్కరించటంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకొని వినతిపత్రాలను పరిశీలించి కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారమార్గం కలెక్టర్ చూపించారు. పీజీఆర్ఎస్‌లో 121 అర్జీలు నమోదయ్యాయి. రెవెన్యూ సదస్సు, సర్వే గ్రామసభలలో వచ్చిన అర్జీలలో 3,400 అర్జీలు ఆడిటింగ్‌కు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి 100 శాతం పరిష్కరించాలని తెలిపారు. నిజాంపట్నం, మార్టూరు, కారంచేడు, జె.పంగులూరు, భట్టిప్రోలు, చీరాల మండలాలలో అర్జీలు సక్రమంగా ఆడిటింగ్ జరగలేదన్నారు. వాటిని పరిష్కరించకపోవటంపై ఆయన ఆరాతీశారు. పెండింగ్ అర్జీలపై పూర్తి స్థాయిలో ఆడిట్ చేయాలని, గడువులోగా పరిష్కరించాలని వీక్షణ సమావేశం ద్వారా మండలాధికారులను ఆదేశించారు. బాపట్ల, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీల పరిష్కారంపై ఒక టీమ్‌ని ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. గణతంత్ర వేడుకలు, హై టీ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

- అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 15 నుంచి 25 శాతం పెంపు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఒకటో తేదీ నుంచి నూతన చార్జీలు అమలులోకి వస్తాయి. భూముల మార్కెట్ విలువలపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో (మిగతా 6వ పేజీలో)


గుంటూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

బీసీల బంధువు టీడీపీ

- రాజకీయ, సామాజిక హోదా ఇచ్చింది
- బీసీల్లో ఆర్థిక విప్లవం కోసం మరింత కృషి
- జగన్ పాలనలో బీసీలందరికీ అవమానాలే...
- బీసీలకు పవర్ లేని పదవులతో అణగదొక్కిన వైసీపీ
- టీడీపీ బీసీ సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బలహీన వర్గాలైన బీసీ జన బంధువు టీడీపీ అని, బీసీల రాజకీయ, సామాజిక అభివృద్ధి టీడీపీ ఆవిర్భావంతోనే మొదలైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుల నేతృత్వంలో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో టీడీపీలోని బీసీ మంత్రులకు అభినందన సత్కార సభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 1982లో టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాలంటేనే భయపడే బీసీలకు పార్లమెంటు మెట్లు ఎక్కే వరకు టీడీపీ అభివృద్ధి బాటలు వేసిందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక హోదాతో పాటు ఆర్థిక పరిపుష్టత కూడా పొంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఐదేళ్ళ పాలనలో ఇక్కడ జిల్లాల నుంచి ఢిల్లీ వరకు బీసీలకు అన్నీ అవమానాలేనని అన్నారు. పార్లమెంటులో తననే అవమానించేలా వైసీపీ ఎంపీలు వ్యవహరించారని గుర్తుచేశారు. నా బీసీలంటూ పవర్ లేని పదవులు ఇచ్చి అవమానించాడన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు పదవులు ఇచ్చినా వారందరూ జగన్, ఆయన పరివారం వద్ద తలవంచి, వారి ముంగిట కూర్చోవాల్సిందేనన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలకు దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉచిత కోచింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఆన్ లైన్‌లో కూడా డీఎస్సీ కోచింగ్ కార్యక్ర మం ఏర్పాటు చే స్తున్నామన్నారు. బీసీల, ఎస్సీల ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రం లో 8 మంది మంత్రులు, 38 మంది ఎమ్మెల్యేలు, సీఎస్, డీజీపీ, టీటీడీ ఈవో ఎక్కడ చూసినా బీసీలే కనిపిస్తున్నారంటే ఇది బీసీ ప్రభుత్వం కాదా అని స్పష్టం చేశారు.

గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రూ. 3 లక్షలు నుంచి రూ. 3.5 లక్షలు ఇస్తే నా ఎస్సీ, నా బీసీ అనే జగన్ కేంద్ర ప్రభుత్వం రూ. లక్షన్నర ఇస్తే జగన్ కేవలం రూ. 30వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రావాల్సిన రూ. 74వేల కోట్లను దారి మళ్ళించి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. అలానే మాజీ సీఎం జగన్ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లను 33 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ఎంతో మంది బీసీల నాయకత్వానికి గండికొట్టాడని ధ్వజమెత్తారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన బీసీ బిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీ స్థాయికి వెళ్ళారంటే అది (మిగతా 6వ పేజీలో)


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్

చివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పదవులు అలంకరణ కాదు.. బాధ్యత అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నీటి సంఘాల సభ్యులకు సూచించారు. సోమవారం స్థానిక కామేపల్లి కల్యాణ మండపంలో జలవనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా సాగునీరు అందేలా నీటి సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతతో ఇచ్చిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. సుమారు వెయ్యి మంది ఉన్న సాగునీటి సంఘాల సభ్యులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే దాదాపు 1.75లక్షల ఎకరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని తెలిపారు.

గుండ్లకమ్మను ఎండబెట్టి.. ఇసుక దోపిడీ

గత ఐదేళ్లలో సాగునీటి వ్యవస్థను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని గొట్టిపాటి విమర్శించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపించారు. గుండ్లకమ్మను ఎండబెట్టి, గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీకి పాల్పడిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే సరికి జంగిల్ తొలగింపు, కాలువల మరమ్మతులను పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని సాగునీటి సమస్యలను తెలుసుకుంటూ ఆ సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులు, సంఘ సభ్యులు ప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అధికారులతో పాటు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు?





నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్, పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్, వేటపాలెం బాలికోన్నత పాఠశాల రోడ్లు

- ఆందోళనలో చిన్నారులు
- వేగానికి కళ్లెం వేయాలని వేడుకోలు

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో పలు పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి. నిత్యం వాహనాల రద్దీతో రహదారులు రద్దీగా ఉంటున్నాయి. తరచూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో చిన్నారులు సైతం భయాందోళన చెందుతున్నారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్, గర్ల్స్ హైస్కూల్‌కు వందల సంఖ్యలో విద్యార్థుల సంఖ్య ఉంది. అయితే ఈ రెండు స్కూళ్లు చీరాల - బాపట్ల రోడ్డులో ఉండడంతో సైకిళ్లపై, కాలినడకన వెళ్లే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వేల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటాయి. కొద్దిసేపైనా రోడ్డు రద్దీ లేకుండా ఉండడం అరుదు. పైగా వాహనాలు నడిపే వారిలో మద్యం సేవించి, అతివేగంగా వాహనాలను నడపుతున్నారు. మరోవైపు ఆకతాయిలు కూడా పాఠశాలల సమీపంలో షాట్స్ పేలుస్తూ అసౌకర్య వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ సమీపంలో క్రమేపీ వాహనాలు విచ్చలవిడిగా మారాయి. అడ్డూఅదుపు లేకుండా వేగంతో వాహనాలు నడుపుతున్నారు. పైగా ఈ ప్రాంతంలో ఆటో స్టాండ్ కూడా నడుపుతున్నారు. దీంతో అక్కడ నిత్యం గందర గోళంగా ఉంటుంది. దీంతో విద్యార్థినులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన రహదారిలో ఉంది. సమీపంలో పోలీస్ స్టేషన్, పలు బ్యాంకులు, వ్యాపార సముదాయాలు కూడా ఉండడంతో వాహనాల రద్దీ సాధారణంగానే అధికంగా ఉటుంది. రాకపోకలు చేసే బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్లపై వాహనాల వేగాన్ని నియంత్రించడంతోపాటు ఆకతాయిల చేష్టలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక

- నేడు రూ.47.5లక్షల విలువైన సీసీ రోడ్లు ప్రారంభం
- ఎమ్మెల్యే కొండయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక ప్రకారమే అడుగులు వేస్తున్నామని ఎమ్మె ల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవాంగపురిలో రూ.47.5 లక్షలు విలువ గల సీసీ రోడ్లు ప్రా రంభోత్సవం చేయనున్నారు. ఈక్రమంలో ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. జాండ్రపేటలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించి సోమవారం ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

పశువుల ఆరోగ్యం మెరుగునకు వైద్య శిబిరాలు




రామకూరులో గొర్రెలకు నట్టల నివారణమందు తాగిస్తున్న పశు వైద్యాధికారి... మేదరమెట్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

పంగులూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పశువులకు మెరుగైన వైద్యం అందించి పాడి పరిశ్రమను వృద్ధి చేసే లక్ష్యంగా గ్రామాలలో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నటు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని రామకూరులో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన గేదెలకు ఎద ఇంజక్షన్లను చేశారు. వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందచేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్, ఏహెచ్‌ఏలు ప్రమీలా బాయ్, ఏసోబు, భాగ్యజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : పశు పోషకులు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మేదరమెట్ల పశువైద్యాధికారి డాక్టర్ సైదయ్య తెలిపారు. సోమవారం మేదరమెట్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 80 పశువులకు పరీక్షలు చేసి, 600 గొర్రెలకు నట్టల మందు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సైదయ్య మాట్లాడుతూ పోషకులు సూచనలు పాటించడం వలన మెరుగైన పాలదిగుబడి సాధించవచ్చన్నారు. గొర్రెల కాపరులు వ్యాధులు సోకిన వాటిని మందకు దూరంగా ఉంచి, తగ్గేవరకూ మందులు వాడా లన్నారు. ప్రభుత్వ పథకాలను పోషకులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమం లో వైద్య సిబ్బంది, సహాయకులు, పశుపోషకులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వాచ్‌మన్ ప్రవర్తనపై విచారణ



ఆసుపత్రి సిబ్బందిని విచారిస్తున్న విచారణ అధికారి డాక్టర్ శివచెన్నయ్య

మార్టూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్‌మన్, తోటిగా పనిచేస్తున్న బీ కుమార్‌పై జె.పంగులూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శివ చెన్నయ్య విచారణ చేశారు. ఆయన సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి కి వచ్చి కుమార్ పనితీరుపై విచారణ చేసినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు.. గత రెండేళ్ల నుంచి కుమార్ మద్యం తాగి విధులకు హాజరుఅవుతున్నారని, సక్రమంగా విధులకు రావడంలేదని, ఆస్పత్రిలో పనిచేసే మహిళా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తదితర విషయాలపై ఇటీవల సిబ్బంది డీఎంహెచ్‌వో విజయమ్మకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కుమార్ ప్రవర్తనపై సోమవారం శివచెన్నయ్య సిబ్బందితో మాట్లాడి వారిదగ్గర లిఖిత పూర్వకంగా వివరాలను సేకరించినట్లు తెలిసింది. ఈ విచారణ సమయంలో వైద్యాధికారులు డీ లహరి, రేష్మాలతో పాటు ఆస్పత్రి సీహెచ్‌వో ఆంజనేయులుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయంపై శివచెన్నయ్యను ఫోన్‌లో ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. విచారణకు వచ్చిన మాట వాస్తవమే నన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాలు మేరకు విచారణ చేశామన్నారు. ఆ వివరాలను, సిబ్బంది లిఖిత పూర్వకంగా కుమార్‌పై ఇచ్చిన ఫిర్యాదులను డీఎంహెచ్‌వోకు పంపిస్తామన్నారు.

రిసార్టు మోసాలపై.. పోలీసుల గురి

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యా టకాభివృద్ధి సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట నకిలీ వెబ్‌సైట్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఈ నెల 16న ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ కార్యాలయం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ద్వారా బాధితుల వివరాలతో పాటు గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలతో సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పటికే నకిలీ వెబ్‌సైట్‌పై సైబర్ సెల్ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగా, బ్యాంకు ఖాతా వివరాలు జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయి ఉన్నారు

పెద్ద సంఖ్యలో పర్యాటకులు...

జిల్లాలో ఉన్న తీర ప్రాంత బీచ్‌లకు వారాంతాలతో పాటు వరుస సెలవుల వేళ కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరులో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం మంది రెండు వారాల ముందుగానే ఆన్‌లైన్ ద్వారానే రిసార్టులు బుక్ చేసుకుంటారు. వీరినే లక్ష్యంగా చేసుకుని సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు.

సైబర్ మోసగాళ్ల ఈ తరహా మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఏడాది కాలం నుంచి వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ నకిలీ వెబ్‌సైటే వారికి ఆయుధంగా మారుతోంది. బ్యాంకుఖాతాలు, ఫోన్ నంబర్లు ఇవన్నీ తర్వాత దశలోనే. ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే వెబ్‌సైట్‌పై పర్యాటకులకు అవగాహన కల్పించడంలో గానీ, పెద్ద ఎత్తున ప్రచారం చేయడంలో కానీ వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది. పదేపదే సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నా వాటిని కనిపెట్టడంలో సదరు విభాగాల నిర్లక్ష్యం కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏపీటీడీసీయే రంగంలోకి దిగి డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం మొదలైంది. జరిగిన మోసాల్లో అధికశాతం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిటనే జరిగినందున ఇక్కడ నుంచే పోలీస్ శాఖ విచారణ ప్రారంభించింది.

ఇదే కాకుండా రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గదుల వివరాలు తెలుసుకోవడానికి హరిత బీచ్ రిసార్టుకు ఫోన్ చేసే వారిపై కూడా సైబర్ విభాగం దృష్టి పెట్టింది. వెబ్‌సైట్‌లో పెడుతున్న గదుల ఖాళీ వివరాలు, ఫోటోలు ఇవన్నీ కూడా హరిత బీచ్ రిసార్టు ఒరిజినల్ వెబ్‌సైట్‌తోనే పోలి ఉండడంతో ఆ దిశగా కూడా పోలీస్ శాఖ విచారణ ముమ్మరం చేసింది.



టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

టెక్నాలజీతో ప్రయోజనం

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ప్రయోజనాలు పొందవచ్చని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీఎల్‌సీఐ డిజైన్‌పై జరుగుతున్న మూడు రోజుల వర్క్ షాపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జగదీష్, ఈసీఈ విభాగాధిపతి డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్ కల్కి టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరుగుతుందని చెప్పారు. కల్కి టెక్నాలజీస్ నుంచి వివేక్, వారి ప్రతినిధుల ఆధ్వర్యంలో డిజైన్ ఫ్రంట్ అంట్ ఎండ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విధిగా శిక్షణలో పాల్గొనాలన్నారు. డా.డీవీఎస్ సుకన్య, కె.కవిత కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి పరిశుభ్రంగా ఉండేలా కావాల్సిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలు, అందుకు సంబంధించిన ప్రణాళికల తయారీ, పూర్తి స్థాయిలో గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలు, తాగునీటి సరఫరా, ఇంటి పన్ను వసూలు వంటి పలు అంశాలపై చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల నుంచి చెత్త సేకరణ కార్యక్రమం ప్రతి రోజూ చేపట్టాలన్నారు. రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, నెలలో రెండు సార్లు తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, కార్యక్రమంలో ఈవో ఆర్‌డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో డబ్బు తీసుకొని మోసం

ఎస్పీకి బల్లికురవ మండలం పెదఅంబడిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు

బాపట్లరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ బల్లికురవ మండలం పెదఅంబడిపూడి గ్రామానికి చెందిన పోలవరపు సుబ్బారావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలోఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడు ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకరుల తో మాట్లాడుతూ తాను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్న సమయంలో అంజనారెడ్డి అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి లక్షా30వేలు తీసుకున్నాడు. ఇప్పటికి ఒక సంవత్సరం దాటుతున్నా ఉద్యోగం ఇప్పించకపోగా ఎటువంటి సమాధానం చెప్పడంలేదన్నాడు. ఈవిషయంపై బల్లికురవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

నేడు వెంపరాల, సాధునగర్‌లో విద్యుత్‌కు అంతరాయం

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి రూరల్ ప్రాంతంలోని వెంపరాల, సాధునగర్ ఫీడర్‌ల మరమ్మతులకు సంబంధించి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. విద్యుత్ వినియోదారులు గమనించి సహకరించడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

బీసీల బంధువు టీడీపీ

(5వ పేజీ తరువాయి)

టీడీపీతోనే సాధ్యమైందన్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా తనకు పశ్చిమ టికెట్ ఇచ్చి బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపిన ఘనత టీడీపీ,సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. విజనరీ నాయకత్వం కలిగిన చంద్రబాబు సారధ్యానికి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చరిత్రాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్ నిర్మాణంతో పాటు రైతుల బకాయిలు రూ. 2 వేల కోట్లు విడుదల చేయటం, బీసీ సబ్ ప్లాన్ వంటి అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నా యుడు, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారధి, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.

ఈ క్రాప్ రికార్డులను పరిశీలించిన అధికారులు

పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : మండలంలో తిరగలదిన్నె, మోపాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, సిద్ధవరం గ్రామాల్లో 2024-25 రబీ సీజన్ పంటలను ఈ క్రాప్ చేసిన రికార్డులను కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఈవీ రమణ సోమవారం తనిఖీ చేశారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీ చేయించుకుంటేనే నష్టపరిహారం వస్తుందని చెప్పారు. అనంతరం జొన్న పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో కే రాధ, ఏఈవో నాగేష్, వీపీఏలు కల్యాణ్, సంతోష్, బాలకృష్ణ, రమేష్, హరికృష్ణలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1,18,580

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజోతి) : మండలంలోని కోవిలంపాడు గ్రామంలో మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,18,580 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఈవో శ్రీగిరి రాజు నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.41,340, లడ్డు ప్రసాదం ద్వారా రూ.22,760, అన్నదానం విరాళాల ద్వారా రూ.54,480 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



కలెక్టర్ ద్వారా షీల్డ్‌ను అందుకుంటున్న విద్యార్థిని దివ్య

ప్రతిభ చాటిన బూదవాడ విద్యార్థులు

పంగులూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీలలో ప్రతిభచాటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు. గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత శాఖ వీరగాథ 4.0 ఆన్‌లైన్ పోర్టల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాల పదవ తరగతి విద్యార్థిని భవనం దివ్య 1857 సిపాయిల తిరుగుబాటు అనే అంశంపై సమర్పించిన వ్యాసం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. దివ్యకు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకలో కలెక్టర్ ప్రశంసాపత్రం అందచేశారు. ఇదే పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచనలో నందవరపు యాస్మిన్ మూడో స్థానం, వకృత్వ పోటీలో కొమ్మారెడ్డి జగన్మోహనరెడ్డికి ద్వితీయ స్థానం, క్విజ్ పోటీలో నందవరపు యాస్మిన్, కొమ్మారెడ్డి జగన్మోహనరెడ్డికి ద్వితీయ స్థానం దక్కి, కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నాగరాణి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ అలవల వీరారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

(5వ పేజీ తరువాయి)

కసరత్తు చేసి ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. దీనిపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల వారీగా ఏఏడి నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారని దానిని ఆన్లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే 2019 తర్వాత రూరల్ ప్రాంతంలో ఇంతవరకు భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్ లో కొంతవరకు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. దీంతో కొత్త జిల్లాలు ఏర్పాటైన ప్రాంతాల్లో కొంతమేర రిజిస్ట్రేషన్ చార్జీలు 2022లో పెరిగాయి. ఆ తరువాత 2023 లోనూ అక్కడక్కడ భూములలో సవరించారు ముఖ్యంగా ఒక్కో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా భూముల క్రయ, విక్రయాలు జరిగే గ్రామాలు, అదేవిధంగా బహిరంగ మార్కెట్లో భూముల మార్కెట్ విలువలు ఎక్కువగా పెరిగిన చోట కొంతమేర మార్కెట్ విలువలను పెంచారు. అయితే 2024లో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ తదితర అన్ని ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, పొన్నూరు తదితర అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపార వాణిజ్య కూడళ్ళలోనూ, ధనిక వర్గాలు ఉండే ప్రాంతాల్లోనూ భారీగా కాకపోయినప్పటికీ 15 నుంచి 25 శాతం మేర భూముల మార్కెట్ విలువలను పెంచబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్లలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పెరగబోతున్నాయో అంతే స్థాయిలో భూముల మార్కెట్ విలువలను యథాస్థితిలో కొనసాగించబోతున్నట్లు రిజిస్ట్రేషన్ అధికార వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా ఈ దఫా అనేక చోట్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూముల మార్కెట్ విలువలను తగ్గించబోతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువలను తగ్గించాలంటూ ఎంతోకాలంగా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిళ్ల వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు, అలాగే ప్రభుత్వ మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని సబ్ రిజిస్ట్రార్ లు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని నిర్ణయించారు.

రియల్ రంగంపై పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల రియల్ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఎంతో కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలతో సమానంగా ప్రభుత్వ మార్కెట్‌లో భూముల ధరలు ఉండటం గమనార్హం. ఈ నేపద్యంలో ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు తప్ప, వ్యాపార పరంగా స్థలాలు, పొలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్స్ ఆలోచన లేకుండా ఒప్పంద పత్రాలకు పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా ఒప్పందాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆయా స్థలాల క్రయవిక్రయదారులు ఇబ్బందులు, కోర్టు వివాదాలు ఎదుర్కొంటున్నారు. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇవేమిపట్టవన్నట్లుగా భూముల మార్కెట్ ధరలు పెంచుకుంటూపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి : డీఈవో

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు రోజుల తరబడి రాకుండా ఎక్కువ రోజులు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారు పాఠశాలకు వచ్చేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం సూచించారు. సోమవారం ఆయన అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని రికార్డులను, పిల్లల హాజరు రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగాధర్, సుధాకరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు రూ.5.50కోట్ల నిధులు

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి దృష్టి

పర్చూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజవకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే నియోజవర్గంలో రూ.24కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మించగా, తాజాగా సోమవారం మరో రూ.5.50కోట్లతో సీసీ రోడ్లతోపాటు, డ్రైన్‌లను ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ డీఈఈ ఆదినారాయణ తెలిపారు. అందులో పర్చూరు మండలం నాగుల పాలెంకు రూ.41.35లక్షలు, తిమ్మరాజు పాలెంకు రూ.25లక్షలు, వీరన్న పాలెంకు రూ.25లక్షలు, అడుసుమల్లి రూ.10లక్షలు, పర్చూరుకు రూ.14లక్షలు, ఇనగల్లుకు రూ.35లక్షలు, కొమర్నే నివారిపాలెంకు రూ.10లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. అలాగే కారంచేడు మండలంలోని ఆయా గ్రామాలకు రూ.75లక్షలు, ఇంకొల్లుకు రూ.1.05కోట్లు, యద్దనపూడికి రూ.1.15కోట్లు, మార్టూరుకు రూ.95లక్షలు మంజూరయినట్లు తెలిపారు.

బాలికల విద్యకు ప్రోత్సాహం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
- రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ సాయంతో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ
- త్వరలో మరో 10వేల మందికి అందజేత



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9 చదువుతున్న విద్యార్థినులకు మంత్రి నిధులు, నెదర్లాండ్స్ రోటరీ క్లబ్, దాతల సహకారంతో సమకూర్చిన సైకిళ్లను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలికలందరూ చదువుకోవాలన్న సదుద్దేశంతోనే వారిని ప్రోత్సహించేందుకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన ప్రకాశం జిల్లాలో ఎక్కువ మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారని, వారు గ్రామాల నుంచి పట్టణాలకు రావాలంటే సరైన రవాణా సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి చదువుకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు సుమారు 40 ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సైకిళ్లను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు.

రూ.5కోట్లతో పదివేల సైకిళ్ల పంపిణీ

ప్రస్తుతం 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు సైకిళ్లు ఇచ్చామని, ఇక్కడ పరిస్థిని చూస్తే 6, 7 తరగతుల విద్యార్థినులకూ సైకిళ్లు అవసరంగా గుర్తించామని మంత్రి తెలిపారు. వారికి కూడా త్వరలో సైకిళ్లను అందిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సుమారు పది వేల సైకిళ్లు అవసరమని, వాటిని ఏడాదిలో అందిస్తామని తెలిపారు. తన సొంత నిధులతో పాటు రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ వారి సహాయం, దాతల సహకారంతో బాలికలందరికీ సైకిళ్లు సమకూర్చుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు సుమారు రూ.5కోట్లకు పైగా ఖ ర్చు అవుతుందని తెలిపారు. తరగతి గదులు అధనంగా కావాలని పాఠశాల యాజమాన్యం కోరగా త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు, రోటరీ నెదర్లాండ్స్ ప్రతినిధులు లియో జ్వాగ్ మేకర్, కీస్ వాన్డెన్ బెర్గ్, కోన్ వెస్సర్, వివిధ శాఖల అధికారులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో దెబ్బతిన్న నేల చప్టా

ప్రమాదకరంగా చప్టా

- కొణిదెన - ఉప్పుమాగులూరు రోడ్డులో ప్రయాణమంటేనే హడల్
- ఆందోళనలో ప్రయాణికులు

బల్లికురవ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో నేల చప్టా ప్రమాదకరంగా తయారైంది. చప్టాపై సిమెంట్ మెత్తం లేచి పోయి బద్దబద్దలుగా పగిలి పోవడంతో వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయణం అంటేనే హడలి పోతున్నారు. రాత్రి సమయంలో ఎవరైన ఈ మార్గంలో వస్తే ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలకు రాళ్లను రవాణా చేసే వాహనాలు చప్టా వద్దకు వచ్చి కురుకు పోతున్నాయి. ఇంతటి ప్రమాదంగా ఉన్న చప్టా గురించి ఎవరు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అరోపిస్తున్నారు. రైతులు అయితే పోలాలకు ఈ చప్టా మీదగా వెళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నేల చప్టాను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతగా వాహనాలు నడపాలి



హెచ్చరిక డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి ఆధారంగా ఉన్న యజమాని బాధ్యతగా వాహనాలు నడపాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సోమవారం వేటపాలెం స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో పలుచోట్ల ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి డ్రమ్ములు, హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తరచూ సాధారణంగా మారాయన్నారు. ప్రమాదాంతో కుటుంబంలో వ్యక్తులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుందన్నారు. ఈక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలన్నారు. అధికారులు వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు. ఈపురుపాలెం పోలీస్టేషన్ పరిధిలో ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

పది పరీక్షలపై జాగ్రత్తలు పాటించాలి



స్టడీ మెటీరియల్‌తో పదవ తరగతి విద్యార్థులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రత్యేక జాగ్రత్తలను పాటించి రాణించాలని వేటపాలెం మండలం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భవనం బద్రిరెడ్డి అన్నారు. మార్చిలో పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ద్వారా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పరీక్షలను ఇష్టంతో రాయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాల సుబ్రహ్మణ్యం, కమరున్నీసాబేగం పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న అద్దంకి ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ సభ్యులు

ఘనంగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ దినోత్సవం

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ దినోత్సవాన్ని స్థానిక కార్యాయలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూ నియన్ సభ్యులు పూండ్ల శ్రీనివాసరావు, గుండిమెడ వెంకట సుబ్బారావు, అద్దంకి హరిబాబు, ఏడుకొండలు, నాగార్జున, జైరావు, శ్రీనివాసరావు, ఈ శ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఆర్అండ్ పీఎం, జాండ్రపేట హైస్కూల్, వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట హైస్కూల్, వేటపాలెం ఎంపీపీ స్కూళ్లను ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో భాగంగా పాఠశాలల్లోని అటెండెన్స్ రిజిస్టర్, వంట గది తదితర వాటిని ఆర్డీవో పరిశీలించారు, విద్యార్థులో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాలకు భిన్నంగా మోసపూరిత వ్యవహారాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో హెచ్చరించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆయనవెంట కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. చినగంజాం మం డలం కడవకుదురు నుంచి వేటపాలెం మండలం పాపాయిపాలెంకు వెళుతున్న పోత ఇసుక టిప్పర్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

యద్దనపూడి (మార్టూరు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏ లూరి సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం యద్దనపూడి మండలం గన్నవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు టీడీపీ నా యకులు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చుండి లక్ష్మీనారాయణమ్మ, రంగయ్యచౌదరి పాల్గొన్నారు.

రైతుల హామీల అమలులో కేంద్రం విఫలం

ఇంకొల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరావు అన్నారు. రైతులు, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ చీకటి చట్టాలను రద్దు చేస్తామని చెప్పి, వాటిని రద్దు చేయకుండా అమలు చేసి రైతుల హక్కులను కాలరాయాలని చూస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, గోవిందరాజులు, నార్ని సింగయ్య, మాదాల అంజయ్య, బొగ్గవరపు శంకర్, బాచిన కోటేశ్వరరావు, చిలుకూరు శ్రీనివాసరావు, దర్శి సుబ్బారావు పాల్గొన్నారు.



అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

అక్షరం.. కదిలించింది!

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- సమస్యల పరిష్కారమే అజెండాగా నేడు సమావేశం
- సౌత్‌మోపూరుకు తరలిరానున్న అధికార యంత్రాంగం
- గ్రామస్థులతో నేరుగా మాటామంతీ



ఆంధ్రజ్యోతి అక్షరానికి పాలకవర్గం స్పందించింది. 'అక్షరమే అండగా... పరిష్కారమే అజెండాగా...' అనే నినాదంతో ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రజ్యోతి మొదలు పెట్టిన తొలి ప్రయత్నం సఫలమైంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్‌మోపూరు గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలన్న ఆంధ్రజ్యోతి ప్రయత్నం ఫలించింది. నిత్యం జనం మధ్య ఉండే నాయకుడిగా గుర్తింపు పొందిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అన్నకు తగ్గ తమ్ముడిగా పేరు తెచ్చుకున్న టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు సోమవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించారు. సౌత్‌మోపూరు గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికార యంత్రాంగాన్ని వెంటబెట్టుకొని మంగళవారం సౌత్ మోపూరుకు వస్తున్నారు. 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండగా...' అనే నినాదంతో సౌత్‌మోపూరులో ఆంధ్రజ్యోతి నిర్వహించే చర్చా వేదికకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరధర్‌రెడ్డిలు అధికార యంత్రాంగాన్ని వెంటబెట్టుకొని వస్తున్నారు. పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి నడుం బిగించనున్నారు. ఉదయం 10 గంటలకు సౌత్ మోపూరులోని కల్యాణ మండపంలో ఈ చర్చావేదిక జరగనుంది. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యేకి విన్నవించుకుంటారు. సమస్యల స్థాయిని బట్టి, వనరుల లభ్యతను బట్టి ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి హామీ ఇవ్వనున్నారు. ఈ సమావేశానికి నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్, ఎమ్పీడీవో శైలేంద్రకుమార్ ఇతర శాఖల అధికారులు హాజరవుతున్నారు. సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే ఈ సమావేశానికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు హాజరు కానున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

వాహ్...!

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు ఆహూతులను మైమరపించాయి. వచ్చే నెలలో నగరంలో 27వ సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రుద్రరాజు సత్యనారాయణ రాజు కళాప్రాంగణంలో ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ డప్పు వాయించి, నగారా మోగించారు. కళకారుల నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి.

6



ఎగిరేందుకు నావిక్-02 సిద్ధం

- వందో ఉపగ్రహ ప్రయోగం కావడంతో సర్వత్రా ఆసక్తి
- షార్‌కు చేరుకున్న ఇస్రో చైర్మన్ నారాయణన్


శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిగేషన్ శాటిలైట్ (నావిక్-02)ను ఈనెల 29న ప్రయోగించనుంది. దేశీయ నావిగేషన్ అవసరాలకు దిక్సూచిగా ఇది తోడ్పడనుంది. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఇందుకోసం ఇక్కడి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. షార్ నుంచి వందో ప్రయోగం కావడంతో ఈ రాకెట్ ప్రాముఖ్యత సంతరించుకుంది. దీంతో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకొన్నారు. డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, శాస్త్రవేత్తలతో చర్చించారు. మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. 27.30 గంటల తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది.

తాజా ఉపగ్రహ విశేషాలు

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ పొడవు 50.9 మీటర్లు
- ఈ ఉపగ్రహం పన్నెండేళ్లపాటు రోదసీలో సేవలందిస్తుంది.
- 420.7 టన్నుల బరువుతో నింగికి బయలు దేరుతుంది.
- మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తి చేసి ప్రయోగ వేదికకు తరలించారు.
- శిఖరభాగాన ఉపగ్రహాన్ని పొందికగా అమర్చే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.
- బెంగుళూరు కేంద్రం నుంచి వచ్చిన ఉపగ్రహాన్ని క్లీన్‌రూంలో పలు తనిఖీలు నిర్వహించారు.
- హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన విభాగాన్ని రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు ఎస్ఎస్ఏబీ నుంచి వ్యాబ్‌కు తరలించి అనుసంధానించారు.
- రాకెట్‌కు రెండు స్థాయిల్లో తనిఖీలు చేసి ప్రీ కౌంట్‌డౌన్ రిహార్సల్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు.

- సూళ్లూరుపేట, (ఆంధ్రజ్యోతి)





డిప్యూటీ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్

- 4లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశం

నెల్లూరు(సిటీ), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ పోస్టు ఎంపికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేస్తు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నెల 30వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించిన, ఫిబ్రవరి 3 లేదా 4వ తేదీన ఎంపిక ప్రక్రయ పూర్తి చేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. డిప్యూటీ మేయర్‌గా వైసీపీ నేత ఖలీల్ అహ్మద్ గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో డిప్యూటీ మేయర్ స్థానం ఖాళీ ఏర్పడింది.

ఇక ప్రతి పాఠశాలలో వైఫై!

- స్కూళ్లకు రూటర్, సిమ్ కార్డుల పంపిణీ

మనుబోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఉచితంగా వైఫై ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగాను కూటమి ప్రభుత్వం నుంచి ప్రతి పాఠశాలకు వైఫై రూటర్, కేబుల్, జియో సిమ్ కార్డులను అందజేసింది. సోమవారం ఎంఈవో కార్యాలయంలో వీటిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. గత ప్రభుత్వంలో ప్రతి పాఠశాలకు ఓ టీవి అందజేయగా, దానికి అనుగుణంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించలేదు. దీంతో వైఫై ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించి, భవిష్యత్తులో యాప్‌ల ద్వారా పాఠాలు, నేరుగా ఉపాధ్యాయులతో ఉన్నతాధికారులు మాట్లాడేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.


రిజిస్ట్రేషన్ విలువలు 30 శాతానికి మించలేదు! 'ఆంధ్రజ్యోతి'తో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు 6

ఇంత బరితెగింపా!?

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. రూ.కోట్లు విలువ చేసే భూమి కాజేసేందుకు ఏకంగా జాయింట్ కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేశారు. అయితే మధ్యలోనే వారి క్రిమినల్ వ్యవహారం బట్టబయలైంది. తన సంతకాన్నే ఫోర్జరీ చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న జేసీ కార్తీక్ దీనిపై పోలీసు కేసు పెట్టాల్సిందిగా నెల్లూరు రూరల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. మూడు రోజుల క్రితమే ఆయన దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ కట్టకపోవడం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ అనుచరులు ఉన్నట్టు ప్రచారం నడుస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- ఏకంగా జేసీ సంతకమే ఫోర్జరీ
- అడంగల్ కరెక్షన్ కోసం నకిలీ ప్రొసీడింగ్స్ తయారీ
- కనుపర్తిపాడులో 4.25 ఎకరాలు కొట్టేసేందుకు యత్నం
- తహసీల్దార్ ద్వారా కరెక్షన్ చేసేందుకు కుట్ర
- తెరవెనుక వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ అనుయాయులు?
- తహసీల్దారు ఫిర్యాదు చేసినా కేసు కట్టని పోలీసులు





నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని ఓ సర్వే నెం.4.25 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ఇది నోషనల్ ఖాతాగా నమోదై ఉంది. రూ.కోట్లు విలువైన ఈ భూమి ఇళ్ల స్థలాలుగా ఉన్నట్లు అడంగల్‌లో చూపిస్తోంది. నిబంధనల ప్రకారం నోషనల్ ఖాతాను పట్టా భూమిగా పరిగణించరు. నోషనల్ ఖాతా అంటే సాధారణంగా ఏదో ఒక ప్రభుత్వ భూమి అయి ఉండాలి. దీంతో ఆ భూమిని కొనడం లేదా విక్రయించడం సాధ్యం కాదు. అయితే కొన్ని పట్టా భూములు కూడా రెవెన్యూ సిబ్బంది తప్పిదాల మూలంగా నోషనల్ ఖాతా కింద చేరాయి. అటువంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాకే నోషనల్ ఖాతా నుంచి తొలగిస్తారు. ఇది జాయింట్ కలెక్టర్ స్థాయిలో జరుగుతుంది. అయితే కనుపర్తిపాడులోని నోషనల్ ఖాతా భూమికి సంబంధించిన వ్యక్తులు నిబంధనల ప్రకారం నడుచుకోలేదు. జేసీ స్థాయిలో ఎటువంటి విచారణ జరగలేదు. ఎలాంటి ఆదేశాలూ వెలువడలేదు. అయినా ఆ భూమిని నోషనల్ ఖాతాలో నుంచి తొలగించేందుకు కుట్ర పన్నిన అక్రమార్కులు.. జేసీ ఉత్తర్వులు ఇచ్చినట్లుగా ఆయన పేరుతో ఒక ప్రొసీడింగ్‌ను తయారు చేశారు. దానిపై జేసీ కార్తీక్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పెట్టారు. ఆ ప్రొసీడింగ్స్‌ను నేరుగా నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఆ ప్రొసీడింగ్స్ ప్రకారం తమ అడంగల్‌ను కరెక్షన్ చేయాలని, నోషనల్ ఖాతాను తొలగించి పట్టా ఖాతా ఇవ్వాలని తహసీల్దార్‌పై ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. అయితే ఇప్పుడు అడంగల్ కరెక్షన్ లాగిన్ తహసీల్దార్‌కు లేదు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పుల మూలంగా ఆ అధికారాన్ని జేసీ అప్పగించారు. సదరు సర్వే నెంబరులోని భూమికి సంబంధించిన వెబ్‌ల్యాండ్‌ను జేసీ ఎనేబుల్ చేస్తే గానీ తహసీల్దార్ కరెక్షన్ చేయలేరు. దీంతో తహసీల్దార్ లాజరస్.. ఈ విషయాన్ని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీరాములు దృష్టికి తీసుకెళ్లి జేసీ లాగిన్ లో ఎనేబుల్ చేయాలని కోరారు. అప్పుడు వ్యవహారం జేసీ దృష్టికి వెళ్లింది. వెంటనే అప్రమత్తమైన జేసీ అసలు ఆ ప్రొసీడింగ్స్ తాను ఇవ్వలేదని గుర్తించారు. అనంతరం తహసీల్దార్‌తోపాటు నెల్లూరు రూరల్ పరిధిలోని వీఆర్వోలను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌కు పిలిపించి సదరు ఫోర్జరీ ప్రొసీడింగ్స్‌పై విచారించారు. చివరకు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రొసీడింగ్స్ తయారు చేశారని నిర్ధారించారు.

● కేసు నమోదు చేయని పోలీసులు

ఫోర్జరీ సంతకాన్ని సీరియస్‌గా తీసుకున్న జేసీ కార్తీక్ ఈ వ్యవహారంపై పోలీసు కేసు పెట్టాలని తహసీల్దార్ లాజరస్‌ను ఆదేశించారు. మూడు రోజుల క్రితం తహసీల్దార్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇంతవరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం. ఒక మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తన పరిధిలోని వ్యవహారంపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటన్న చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. అదే సమయంలో సదరు నేరానికి పాల్పడిన వ్యక్తులు వైసీపీ ఎమ్మెల్సీకు చెందిన మనుషులని రెవెన్యూ శాఖలో ప్రచారం జరుగుతోంది. కాగా ఫోర్జరీ ప్రొసీడింగ్ ఎక్కడ తయారయ్యిందన్న దానిపై కూడా రెవెన్యూ శాఖలో లోతుగా విచారణ జరుగుతోంది. ఈ వ్యవహారం మొత్తం బయట వ్యక్తులే చేశారా!? లేదా ఇంటి దొంగల హస్తం కూడా ఉందా..? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.

- ఈ వ్యవహారంపై తహసీల్దార్ లాజరస్‌ను వివరణ కోరగా జేసీ సంతకాన్ని ఫోర్జరీ చేసి దానితో తయారు చేసిన ప్రొసీడింగ్స్‌ను ఓ వ్యక్తి తమకు అందించినట్లు చెప్పారు.. విచారణలో ఇది దొంగ ప్రొసీడింగ్స్ అని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ డాక్యుమెంట్ కోవూరులో తయారు చేసినట్లుగా ప్రాథమికంగా తేలిందని చెప్పుకొచ్చారు.
- దర్గామిట్ట సీఐ వివరణ కోరగా తహసీల్దార్ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

'జెన్‌కో'లో విజయోత్సవం



ముత్తుకూరు మండలం నేలటూరులోని ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో సోమవారం విజయోత్సవ సంబరాలు జరిగియి. ఏపీఎస్ఈబీ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో సీఈ సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్లాంట్ ఆవరణలోని దామోదరం సంజీవయ్య, జ్యోతిరావుపూలే దంపతులు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ సుధీర్ బాబు మాట్లాడుతూ జెన్‌కో కేంద్రం బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకోవడంలో కాంట్రాక్ట్ వర్కర్స్ నుంచి సీనియర్ ఇంజనీర్ వరకు అందరి పాత్ర ఉందన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి ఇటువంటి అవార్డులు మరిన్ని సాధించాలన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే బెస్ట్ ప్లాంట్‌గా జెన్‌కో థర్మల్ కేంద్రాన్ని నిలుపుకో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఈబీ ఇంజనీర్లు, అసి స్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి)

తెలుగు ప్రజల ఆశాజ్యోతి నారా లోకేష్

● యువగళం సంబరాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి



నెల్లూరు (వైద్యం) జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగ ప్రజల ఆశాజ్యోతి విద్యా, ఐటీశాఖామంత్రి నారా లోకేష్ అని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి అన్నారు. లోకేష్ యువగళం ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం కేక్‌కట్ చేసిన నేతలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం లోకేష్ రాష్ట్రంలో యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహించారన్నారు. వైసీపీ పాలనపై పోరాడిన టీడీపీ నేతలపై గత ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నారా లోకేష్ వారికి అండగా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్ర మంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు, నేతలు కువ్వారపు బాలాజీ, మహిళా నేతలు కప్పిర రేవతి, పీటీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, బుచ్చిలోనూ టీడీపీ నేతలు సంబరాలు చేశారు.

హెల్మెట్ ధరించాలంటూ పోలీసుల ర్యాలీ

నెల్లూరు(క్రైం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని నగర డీఎస్పీ పీ సింధుప్రియ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నగర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు డీఎస్పీ కార్యాలయం నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీఎస్పీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది ద్విచక్రవాహనచోదకులు తలకు గాయాలై మృతిచెందుంతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నగర ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథ రామారావు, రోశయ్య, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటరెడ్డి, రామకృష్ణ, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



భూముల రిజిస్ట్రేషన్ విలువలు

30 శాతానికి మించలేదు!

● కొన్ని మండలాల్లో పెంపు, ఇంకొన్నిచోట్ల తగ్గింపు

● జిల్లాకు రూ.40 కోట్ల అదనపు ఆదాయం

● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



జిల్లాలో ఫిబ్రవరి ఒకటి నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువలు పెరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను సవరిస్తున్నారు. కొన్నిచోట్ల పెరిగితే ఇంకొన్నిచోట్ల భూ విలువలు తగ్గనున్నాయి. ఇందుకు సంబంధించి కసరత్తు పూర్తయింది. విలువల సవరణలతో జిల్లాకు నెలకు రూ.40 కోట్లు అదనపు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విలువల పెంపు ఎలా జరిగింది? ఎంత వరకు వచ్చిందనే అంశాలపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఆంధ్రజ్యోతికి వివరించారు.

● ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో భూముల విలువల సవరణకు జేసీ కమిటీకి ప్రతిపాదనలను పంపాం. కొత్త ధరలపై కసరత్తు పూర్తయింది. ఎక్కడైతే కొత్తగా లేఅవుట్లు వస్తున్నాయో అక్కడ మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ధరలు చాలా తక్కు వగా ఉన్నాయి. అభివృద్ధి, మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకుని ధరలు నిర్ణయించాం.

● 30 శాతానికి మించి పెంచలేదు

కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసే భూములకు మంచి మార్కెట్ ఉంటుంది. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రోడ్ల పక్కన భూములకు కూడా బాగా డిమాండ్ ఉంటుంది. జిల్లా లో కొత్త లేఅవుట్లు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. కోర్ ఏరి యాలో కూడా 30 శాతం కన్నా తక్కువగానే ధరలు పెం చాం. అలాగే నెల్లూరు నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లు ఉన్న ప్రాంతాల్లో భూముల విలువలను సవరించాం. నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్, కందుకూరు, కావలి, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట, టీపీగూడూరు, ముత్తుకూరు మండలాల నుంచి 65శాతం ఆదాయం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు వస్తుంది. మిగిలిన 35శాతం ఇతర మండలాల నుంచి వస్తుంది. అందువల్ల ఈ మండలాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నాం. నెల్లూరు నగరంలో కొత్త వాణిజ్య డోర్ నెంబర్లను ఎస్ఎంసీ ద్వారా సేకరించి వాటి మా ర్కెట్ విలువలను సవరించాం. మార్కెట్ విలువల తాత్కాలిక నివేదికను రిజిస్టర్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందు బాటులో ఉంచాం. వాటిపై అభ్యంతరా లను స్వీకరించాం.' అని ఆయన వివరించారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 3వతేదీ వరకు పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పీ గోపీనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ సంస్థ తరపున ఈనెల 29న అరుద్ర సాహిత్యంపై జనకవచం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ జనకవనంలో జిల్లాలోని కవులు వినిపించిన కవితలు కవితా సంకలనం ముద్రిస్తామని తెలిపారు. అవకాశాన్ని కవులు, రచయితలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు 'షోకాజ్'

ఆత్మకూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా హౌసింగ్ అధికారులు సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిసున్న గృహ నిర్మాణాలకు సంబంధించిన విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున బి చిరువెళ్ల, కరటంపాడు, బట్టేపాడు సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జూనియర్ ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ రౌండ్స్‌లో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలుర రికర్వ్‌రౌండ్‌లో కే తరుణీష్‌జాత్య బంగారు, ఆర్.సాయి మౌర్యా వెండి పతకాలను, ఇండియన్ రౌండ్ లో జీ వెంకటలోకేష్ బంగారు, ఎ.సాత్విక్ వెండి, బాలికల ఇండియన్ రౌండ్‌లో వై.దీత్యా చండిక కాంస్యపతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమబంగా ల్‌లోని బోల్‌పూర్‌లో ఫిబ్రవరి 10 నుంచి 17వరకు జరగనున్న జాతీయ జూనియర్ ఆర్చరీ పోటీలకు రాష్ట్రం నుంచి వీరు ప్రాతి నిధ్యం వహించనున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు శివశంకర్, భరద్వాజ్, హారతి పాల్గొన్నారు.

నేడు ఐటీఐలో జాబ్‌మేళా

నెల్లూరు(విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొని అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి, ఆసక్తి కలిగిన యువత ఆధార్, బయోడేటాతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని తెలిపారు. అలాగే నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు.

రేపు 'ఇంటర్' సమావేశం

నెల్లూరు(విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ. శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి పోలీసు, మునిసిపల్, కార్పొరేషన్, వైద్య, విద్య, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ శాఖల అధికారులకు ఆహ్వానాలు పంపించామని, ప్రతిఒక్కరూ తప్పక హాజరు కావాలని కోరారు.

అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లతో కేపీసీ కళాశాలలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 1, 3 తేదీల్లో జరిగే నైతిక, మానవీయ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలతోపాటు ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభంకానున్న ఒకేషనల్ ప్రాక్టికల్స్, 10 నుంచి జరగనున్న జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తామ న్నారు. సమావేశం పూర్తయ్యాక పరీక్షల నిర్వహణకు అవసరమైన సమాధాన పుస్తకాలను, ఇతర స్టేషనరీని ప్రిన్సిపాళ్లకు అందచేస్తామన్నారు. మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్ష కేంద్రాల ఖరారు, ముఖ్యమైన సిబ్బంది నియామకాలు కూడా పూర్తయ్యాయని ఆయన వివరించారు.

వాహనం ఢీకొని జింక మృతి

వెంకటాచలం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చెముడుగుంట వద్ద జిల్లా సైన్స్ మ్యూజియం ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ జింక మృతి చెందగా మరో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు .. నీటి కోసం వచ్చిన జింకలు రహదారి దాటుతుండగా వాహనం ఢీకొంది. ఒక జింక అక్కడికక్కడే మృతి చెందగా మరో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన జింక కడుపుతో ఉండటం వల్ల ఈ ప్రమాదంతో పిండం బయటపడింది. అటవీ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● చేతి వృత్తిదారుల సమస్యలపై చర్చిస్తాం ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు (వైద్యం) జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీ.వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో చేతివృతి దారుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేటీకరణతో చేతి వృత్తులన్నీ దెబ్బతింటున్నాయన్నారు. ఉత్పత్తిదారులు తయారు చేసిన వస్తువులకు మార్కెట్ దర కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 70 కోట్ల మంది మూడు పూటలా తినటం లేదని సుప్రీంకోర్టు చెప్పినంద వల్ల చేతి వృత్తిదారులు తయారు చేసిన వస్తువుల కొనుగోలు చేసేలా ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. ఈ సమస్యలన్నీ రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. చేతి వృత్తిదారులు సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య మాట్లాడుతూ వృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ. 39వేల కోట్లు కేటాయించాలని, 50 ఏళ్లకే పింఛన్ అందచేయాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందచేయాలన్నారు. గుంజి దయాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, వివిధ చేతివృత్తి దారుల నేతలు అంకయ్య, బెల్లంకొండ బాలవెంకటేశ్వర్లు, అచ్చి తిరుపాలు, హనుమంత్, సుబ్రహ్మణ్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఐదుకిలోల కణితి తొలగింపు

● చికిత్స విజయవంతంపై వైద్యులకు అభినందనలు

నెల్లూరు (వైద్యం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జీజీహెచ్‌లో సోమ వారం ఓ వ్యక్తి ఎడమ భుజంలో ఉన్న ఐదు కిలోల కణితిని వైద్యులు విజయవంతం గా తొలగించారు. ఈ సందర్భంగా జనరల్ సర్జన్ డాక్టర్ కాలేషాబాషా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతి జిల్లా నాయుడుపేటకి చెందిన కోవూరు క్రిష్ణయ్య (55) పదేళ్లుగా ఎడమ భుజంపై కణితితో బాధపడుతున్నాడు. ఈ చిన్న కణితిపై నిర్లక్ష్యం చేయటంతో ప్రస్తుతం ఆ కణితి ఐదు కిలోలకు పెరిగింది. ఈ పరిస్థితిలో పలు ఆసుపత్రులకు తిరిగినా ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి రావటంతో జీజీ హెచ్‌ను సంప్రదించాడు. బాధితుడికి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స ద్వారా కణితిని తొలగించామని డాక్టర్ వివరించారు. డాక్టర్ సుహాసిని, డాక్టర్ ఉమా మహేష్, మత్తు వెద్యులు డాక్టర్ జగదీష్ వైద్య బృందం సహకారంతో ఈ శస్త్రచికిత్స చేశామని ఆయన వెల్లడించారు. ఈ శస్త్రచికిత్స విజయవంతం చేయటంపై సూపరిం టెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ వైద్యులకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

కత్తితో బెదిరించి దోపిడీ

నెల్లూరు(క్రైం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని ముగ్గురు కత్తితో బెదిరించి అతడి చేతికున్న ఉంగరం, నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం రెడ్డిగారిపాలెంలో దినేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయన నెల్లూరు బృందావనంలోని ఓ కళ్లద్దాల దుకాణంలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 25న పని ఎక్కువగా ఉండటంతో అర్ధరాత్రి వరకు షాపులోనే ఉన్నారు. పని ముగించుకొని షాపు నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఇరుగాళమ్మ గుడి సమీపంలోకి వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు అతడిని అడ్డుకున్నారు. వారు కత్తితో అతడ్ని బెదిరించి చేతికున్న ఉంగరం, జేబులో ఉన్న రూ.1200 నగదు దోచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఆదివారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు మాట్లాడుకోవడాన్ని బట్టి వారి పేర్లు జగదీష్‌కుమార్, సమీర్, నవాజ్‌లని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ ఏ అయ్యప్ప సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించేం దుకు చర్యలు చేపట్టారు.

పెళ్లి పేరుతో బాలికపై లైంగిక దాడి : పోక్సో కేసు నమోదు

వెంకటాచలం, జనవరి 27 (ఆంధ్రప్రదేశ్): వివాహం చేసుకుంటానని నమ్మించి బాలికపై లైంగికదాడికి పాల్పడి మోసం చేసిన యువకుడిపై సోమవారం ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని కనుపూరు గ్రామంలోని జ్యోతి నగర్ ప్రాంతానికి చెందిన మొండెం కృష్ణవంశీ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికాడు. ప్రేమలో పడిన ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి రెండు దఫాలు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న ఆ యువకుడు ఆ బాలికకు మాత్రలు ఇచ్చి గర్భం తొలగింపచేశాడు. మళ్లీ ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా అందుకు నిరాకరించడంతో ఆ బాలికను విచక్షణ రహితంగా కొట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈక్రమంలో ఆ యువకుడి చేతిలో మోసపోయానని గ్రహించిన బాలిక వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

● గజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

● ఐదు వరకు దరఖాస్తుల స్వీకరణ

● 7న జడ్పీలో డ్రా నిర్వహణ

నెల్లూరు(క్రైం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు గీత కులాలకు వైన్‌షాపుల్లో పది శాతం కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీని నెరవేరుస్తూ జిల్లాలో 18 వైన్ షాపులను గీత కులాలకు కేటాయించింది. గౌడ్‌లకు 6, గౌడకు 7, గమళ్లకు 4, గౌండ్ల కులానికి ఒక షాపును కేటాయిస్తూ ఇటీవల లాటరీ తీశారు. కాగా గీతకులాలకు వైన్‌షాపుల కేటాయింపు పక్రియకు సోమవారం ప్రభుత్వం గజిట్ విడుదల చేసింది. జిల్లాలోని 18 షాపులకు ఫిబ్రవరి 5వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 7న జిల్లా కలెక్టర్ సమక్షంలో నగరంలోని జడ్పీ కార్యాలయంలో లాటరీ తీసి షాపులను కేటాయిస్తారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ గీతకులాలకు చెందిన వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రైడ్ పక్రియల దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరణకు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసుకునే గీతకులాలకు వారు జిల్లాలో నివసించే వారై, కేటాయించిన సబ్‌కులం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు రుసుము రూ.2లక్షలని తెలిపారు. అర్హులయినవారు ఎన్ని దరఖాస్తులు అయినా చేసుకోవచ్చని, అయితే దుకాణం మాత్రం ఒకటే కేటాయిస్తామని అధికారి చెప్పడం గమనార్హం.



అలరించిన సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు

● ముఖ్య అతిథిగా సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ హాజరు



సాంస్కృతిక ప్రదర్శనల నగారా మోగిస్తున్న తమ్మారెడ్డి

నెల్లూరు (వైద్యం) జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ గేట్ వద్ద రుద్రరాజు సత్యనారాయణ రాజు కళాప్రాంగణంలో ఈ ఉత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పాల్గొన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వచ్చే నెలలో నెల్లూరులో జరిగే 27వ సీపీఎం రాష్ట్ర మహాసభల నగారాను భరద్వాజ మోగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నానని చెప్పారు. పార్టీ కోసం, దేశం కోసం ఎందరో ఉద్యమ నాయకులు పోరాటం చేశారన్నారు. రెండు సీట్లకే పరిమితమయిన బీజేపీ 15 ఏళ్లుగా కేంద్రాన్ని పాలిస్తుందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలకు అనుగుణంగా యువత పనిచేయాలన్నారు. దేశాన్ని రక్షించే విధంగా సీపీఎం నేతలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రేబాల డప్పుల దళం, దామరమడుగు పిల్లల డాన్స్, నటరాజ డాన్స్ ఇనిస్టిట్యూట్, వేమన బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మంగలి పుల్లయ్య, రెహానాబేగం, విజయ్‌కుమార్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో యువకుల సందడి

అన్న క్యాంటీన్‌లో అవినీతి గుట్టు రట్టు

● సిబ్బంది తొలగింపునకు కమిషనర్ ఆదేశం

నెల్లూరు(సిటీ), జనవరి 27,(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో అవినీతి జరుగుతుందని గ్రహించిన నగర కమిషనర్ సూర్యతేజ, దాని గుట్టును రట్టు చేశారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు ఆయన ఆకస్మికంగా అన్న క్యాంటీన్‌లోకి వెళ్లారు. బిల్లింగ్ పాయింట్ వద్ద పరిశీలించగా 10 టోకన్లే జారీ చేసినట్టు ఉంది. అల్పాహారం వడ్డించే వ్యక్తుల వద్ద చిల్లర (రూ. 5లు) ఉంది. పాత్రల్లో అల్పాహారం వాడేసినట్టు గ్రహించారు. ఎవరితో ఏం మాట్లాడకుండా కొంత సమయం అక్కడే ఉన్నారు. ఇంతలో రెగ్యులర్‌గా వచ్చే కొందరు లబ్ధిదారులు వచ్చారు. వారు టోకెన్ తీసుకోకుండా నేరుగా వడ్డించే వారి దగ్గరకెళ్లి రూ. 5లు ఇచ్చి అల్పాహారం పెట్టమని కోరారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న కమిషనర్ అతడితో మాట్లాడారు. టోకెన్ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించగా తాను ఎప్పుడూ తీసుకోనని, వడ్డించేవారికే నగదు ఇస్తానని, తాను రెగ్యులర్ వచ్చేవాడనని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ అన్న క్యాంటీన్‌లోని సిబ్బందిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వెటరన్స్ ఉత్సాహం..

● ఆకట్టుకున్న బ్యాడ్మింటన్ పోటీలు ● రాష్ట్రస్థాయి పోటీలకు పలువురి ఎంపిక



జ్ఞాపికలతో బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

నెల్లూరు(విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వెటరన్స్ జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో పురుషుల 35 ఏళ్ల సింగిల్స్ విభాగంలో పవన్‌కుమార్, ఎస్‌కెఎస్ అలీ, డబుల్స్‌లో ఎస్‌కె.ముజమిల్ - పవన్ కుమార్, పవన్‌కుమార్-సతీష్, 40 ఏళ్ల సింగిల్స్‌లో పవన్‌కుమార్, కృష్ణచైతన్య, డబుల్స్‌లో అమర్‌నాథ్-షమీర్‌ఖాన్, సురేష్-పవన్, 45 ఏళ్ల సింగిల్స్‌లో ఎ.శ్రీనివాసులు, కె.సుబ్రహ్మణ్యం, ఎన్.సురేష్, డబుల్స్‌లో ప్రవీణ్‌కుమార్-ధృవకుమార్, శ్రీనివాసులు-సుబ్బు విజేతలుగా నిలిచారు. అలాగే 50 ఏళ్ల సింగిల్స్‌లో మోడీ శంకర్ నారాయణ, పీ విశ్వ ప్రకాశం, డబుల్స్‌లో శంకర్‌నారాయణ-చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జున-జయ, 55 ఏళ్ల సింగిల్స్‌లో బీ మోసెస్, ఎస్.వంశీమోహ న్, డబుల్స్‌లో మోసెస్-శ్రీనివాసులు, ఎన్వి.రామయ్య-వంశీ, 60 ఏళ్ల సింగిల్స్‌లో బీ మల్లికార్జునరావు, సీవీ.సుబ్బారెడ్డి, డబుల్స్‌లో పీవీ.నారాయణరావు - బి.మల్లిఖార్జునరావు, సీవీ.సుబ్బారెడ్డి-డి.సు రేంద్రబాబు, 65 సంవత్సరాల సింగిల్స్‌లో జీ ఆంజనేయులు, డబుల్స్‌లో జీ ఆంజనేయులు-కేపీఐ ఆనంద్‌కుమార్, 70 ఏళ్ల సింగిల్స్‌లో బి.ప్రభుదాస్, ఐ.శ్రీహరి, డబుల్స్‌లో ప్రభుదాస్-శ్రీహరి విజేతలుగా నిలిచారు.

● మహిళల 35, 40 ఏళ్ల సింగిల్స్ విభాగంలో ఎం.అర్చన, డాక్టర్ బిందు భార్గవిరెడ్డి, 50 ఏళ్ల విభాగంలో ఎ.భానుమతి, శారదా నాయుడు, 55 ఏళ్ల విభాగంలో డాక్టర్ వీ.ఉషారాణి, 60 ఏళ్ల విభాగంలో కమలాసాహితి విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ 35 ఏళ్ల విభాగంలో ఎం.అర్చన-పి.అమర్నాథ్, 40 ఏళ్లలో డాక్టర్ బిందుభార్గవి-పి.సమీర్‌ఖాన్, 50 ఏళ్ల విభా గంలో కె.శారదానాయుడు-ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, 60 ఏళ్ల విభా గంలో వి.కమలా సాహితి-సివి.సుబ్బారెడ్డి గెలుపొందారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు విజయవాడలో జరిగే మాస్టర్ వెటరన్స్ రాష్ట్రపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం నేతలు, కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్వోబీ వంతెనకు మరమ్మతులు

స్తంభించిన ట్రాఫిక్



వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

కావలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెనపై తరచూ మరమ్మతు పనులు చేపడుతుండటంతో ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. వంతెన స్పాన్‌ల జాయింట్ల వద్ద ఉన్న బేరింగ్‌లు దెబ్బతినడంతో వంతె రోడ్డులో గుంతలు పడ్డాయి. దీనికి శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కావలి-ఉదయగిరి జాతీయ రహదారిని వంతెన మీదుగా పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో కలిపి అక్కడ నుంచి మద్దూరుపాడు బైపాస్ వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. వాస్తవంగా అయితే వంతెన మీద పూర్తిగా రాకపోకలను బంద్ చేస్తే మరమ్మతులు అనువుగా ఉంటాయి. ప్రత్యామ్నాయం లేకపోవడంతో వంతెనపైనే రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఈ మార్గంలో ఉదయగిరి, పెద్దపవని మార్గాల నుంచి వచ్చే వాహనాలు, బస్సులన్నీ రావాల్సి ఉంది. వంతెనపై సగభాగంలో రాకపోకలు సాగేలా చర్యలు తీసుకుని మిగిలిన సగభాగంలో పనులు చేపడుతున్నారు. వన్‌వే మార్గం కావటంతో రెండు వైపులా ఒకేసారి వాహనాలు రాకపోకలు సాగేందుకు వీలుపడదు. ఎదురుగా వచ్చే వాహనాలను వదిలిన తర్వాత మరలా ఆ మార్గంలో మరొక మార్గంలోని వాహనాలను వదులుతున్నారు.

నారాయణపురానికి బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

దగదర్తి, (బిట్రగుంట) జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపురంకు ఆర్టీసీ బస్సు సౌకర్యంను ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కల్పించారు. కొన్నేళ్లుగా తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోవడంతో ఈచర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కావలి నుంచి దగదర్తి, నారాయణపురం, అనంతపురం, దామవరం మీదుగా బస్సు నెల్లూరుకు వెళ్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సోమవారం ఆర్టీసీ బస్సుకు రిబ్బన్ కట్‌చేసి టికెట్ కొనుగోలుచేసి ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవి కుమార్‌చౌదరి, మండలాధ్యక్షుడు హనుమంతరావు, నేతలు పులిశీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే.. లక్ష్యం కష్టం కాదు

కావలి టౌన్, : ఇష్టపడి చదివితే లక్ష్యం చేరుకోవడం కష్టమేమికాదని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఎస్వీఆర్ కల్యాణ మండపంలో శ్రీనివాస జూనియర్ కళాశాల 11వ వార్షికోత్సవం కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురుజాల మాల్యాద్రి నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. క్రీడాపోటీలు, సాంస్కృతిక పోటీల విజేతలకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, ప్రిన్సిపాల్ మాలకొండయ్య, డైరెక్టర్లు, పాల్గొన్నారు.

సీఎం దావోస్ పర్యటన విజయవంతంపై హర్షం

కావలి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన విజయవంతమైందని, వరల్డ్ ఎకానమిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ముసునూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జగన్‌రెడ్డి నిర్వాహకంతో అంధకారంలోకి వెళ్లిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకవచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు రేయింబవళ్లు కష్టపడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకవచ్చే శ్రమ సత్ఫలితాలను ఇస్తుందన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి హర్షం

●కందుకూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్రమంత్రి యువనేత నారా లోకేష్‌ల దావోస్ పర్యటనలో భాగంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులోనే ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలవటం హర్షనీయం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై దళితుల ఆందోళన



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళితులు

కావలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం పలువురు ఆర్డీవో ఎం.సన్నీవంశీ క్రిష్ణను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆనెమడుగు పంచాయతీ బైనేటివారిపాలెంకు చెందిన అరంధతీయులు అధికసంఖ్యలో కార్యాలయానికి వచ్చి ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు వదిలిన స్థలాన్ని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.వరప్రసాద్ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం గతంలో గ్రామ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధిహామీ కింద మట్టి తోలారన్నారు. అయితే ప్రస్తుతం వరప్రసాద్ ఆ స్థలంకు పట్టా ఉందని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఉన్నతాధికారుల స్పందించి సమస్యపై న్యాయం చేయాలని కోరారు.

శంభుని కాపులను ఎస్సీల్లో ఎలా చేరుస్తారు ?

అయోధ్య కాపులనబడే శంభుని కాపులను (రెడ్డి) ఎస్సీల జాబితాలో చేర్చటం రాజ్యాంగ విరుద్ధం దళిత నేత సాల్మన్ రాజు ఆధ్వర్యంలో అల్లూరు మండల దళితులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వలంటరీ వ్యవస్థతో శంభుని కాపులను ఎస్సీల జాబితాలో చేర్చి నిజమైన ఎస్సీల కడుపులు కొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కులగణన చేపట్టి నిజమైన ఎస్సీలకు న్యాయం జరిగేట్లు చూడాలన్నారు. ఎస్సీ జాబితాలో ఉద్యోగాలు పొంది ఉన్న శంభుని కాపులను వారి ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

ఉల్లాస్‌పై అవగాహన సదస్సు



సామగ్రి అందజేస్తున్న అధికారులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పొదుపు మహిళలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆయాలు, వాచ్‌మెన్లు, పారిశుధ్య కార్మికులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అందుకుగాను గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఆయా విభాగాల్లోని నిరక్షరాస్యులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించి సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్‌రావు, సీసీలు, పొదుపు మహిళలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సీతారామపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చొరవతో సీతారామపురం గ్రామ పంచాయతీలో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకట సుబ్బమ్మ తెలిపారు. గ్రామ పంచాయతీలోని కస్తూరిబా విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా కస్తూరిబా విద్యాలయానికి పోవుటకు సరైన రోడ్డు లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో సిమెంట్ రోడ్డు మంజూరుచేసి నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు.

రూ.5 లక్షలతో బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

ఉదయగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీనగర్‌లో రూ.5 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం రోడ్డు నిర్మాణానికి సంబంధించి కొలతలను సేకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఆర్టీవో



వరికుంటపాడు : జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

అనంతసాగరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఆత్మకూరు ఆర్డీవో రాములు, అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం అనంతసాగరంలో సోమవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మస్తాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

●సంగం : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్ఐ రాజేష్ మహిళా ఉద్యోగులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు మహిళా ఉద్యోగులతో స్కూటర్‌పై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

●దుత్తలూరు(ఉదయగిరి) : వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని కావలి ఆర్టీవో వె సుధాకర్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం దుత్తలూరులోని విశ్వతేజ, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సుందరరావు, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీ లక్ష్మీ, పాఠశాల కరస్పాండెంట్లు దొంతి రెడ్డి వాసుదేవరెడ్డి, ఉదయ శంకర్ రెడ్డి, బాలనరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించా లని ఎస్ఐ రఘునాథ్ సూచించారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మహిళా పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●వింజమూరు : పట్టణంలోని నేతాజీ వికాస్ హైస్కూల్ అండ్ కాలేజీ ఆవరణలో సోమవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో వై సుధాకర్‌రెడ్డి, వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు పాల్గొని మాట్లాడుతూ రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

● పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీధర్‌రావు



కందుకూరు: పశువులకు మందు వేస్తున్న డీడీ శ్రీధర్‌రావు

కందుకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పశుపోషకులు బహువార్షిక పశుగ్రాసాల సాగుతో దాణా ఖర్చులు తగ్గించుకోవాలని ఈ సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీధర్‌రావు తెలిపారు. సోమవారం మహదేవపురం, బలిజపాలెంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఐదెకరాల లోపు భూమి కలిగి ఉన్న పశుపోషకులకు గ్రాసం సాగు చేస్తే రూ.34వేలు రాయితీ వస్తుందన్నారు. కార్య క్రమంలో కందుకూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు చంద్రమోహన్, మండల పశువైద్యాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

●సంగం : మండలంలోని దువ్వూరు ఉప పశువైద్య కేంద్రంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాడు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సుజని పశువులకు టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులను ఆదుకునేందుకు గోకులం షెడ్లు, పశుగ్రాసం పెంపకం వంటి పథకాలను ప్రవేశపెట్టిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

●కలువాయి: మండలంలోని ఉయ్యాలపల్లిలో సోమవారం పశు సంవర్థక శాఖ అధికారులు పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. పశుయాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. డాక్టర్ గంగాధర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

●కొండాపురం : సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో సోమవారం పశుసంవర్ధక శాఖ అధికారులు ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మధు పశువులకు నట్టల నివారణకు మందులు తాగించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు బొల్లినేని వెంకట రమణయ్య, నాదెండ్ల సురేష్, మాల్యాద్రి పాల్గొన్నారు.

●సీతారామపురం : గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తప్పనిసరిగా వేయించాలని ఉదయగిరి వెటర్నరీ ఏడి శశిధర్ సూచించారు. మండలంలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్ఆర్ నగర్‌లో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సంగం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుందని ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో సంయుక్త ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఉపకరణాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన ఉపకరణాలకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ లెక్చరర్ రామానుజులు, ఆర్థోపెడిక్ మిత్ర, స్పెషల్ ఎడ్యుకేటర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

ఉదయగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న కార్పొరేషన్ రుణాలు, సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో నిజమైన నిరుపేదలకు అందడంలేదని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి గోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో పేదలు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు, రుణాలు అందేలా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డొక్కా చిరంజీవి, లెనిన్‌బాబు, అమర్, ఇంతియాజ్, హేమంత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం దారుణం

వింజమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి పంచాయతీ కార్యదర్శిపై నిధుల దుర్వినియోగం ఆరోపణలు చేస్తూ సస్పెండ్ చేయడం దారుణం అని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక దళిత కార్యదర్శిపై కక్ష పూరితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని, అధికారులు కూడా సమగ్ర విచారణ జరిపి సర్పంచ్ చెక్ పవర్ కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి మాదిగ, మల్లెల తిరుమలేష్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గంగపట్ల సురేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

విట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

కావలి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆత్మకూరు భక్తవత్సలకు హైదరాబాద్ జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. సోమవారం విట్స్ కళాశాలలో భక్తవత్సలను విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ లిఖిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్‌కుమార్, శ్రీనాథ్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

30 నుంచి ఆలయ జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్మన్, గ్రామపెద్దలు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలను ఈనెల 30 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాదాల బాబురావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆలయ ఆవరణలో గ్రామపెద్దలతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగయ్య, గ్రామపెద్దలు మాదాల తిమ్మయ్యచౌదరి, గోగినేని రామచంద్ర, మేడేపల్లి మాల్యాద్రి, పులివర్తి రమణయ్య, తలసీరామ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరుడికి అభిషేకం

సంగం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో ఉన్న నందీశ్వరునికి సోమవారం అభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పండ్ల రసాలు, క్షీర, పంచామృత, నవ సుగ్రద్వ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుని పూలతో అలంకరించారు. రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

వింజమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రిపాలెంలోని వడ్డెర సంఘం నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలామణి, ఆయన కుటుంబ సభ్యులు రూ.2లక్షలు విరాళంగా ప్రకటించారు. 150 మంది పేదలకు దుప్పట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాశిలామణి, ఆయన కుటుంబ సభ్యులు, బి.సంజీవులు, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు ఆనంద్, న్యాయవాది అశోక్, రామాలయం నిర్మాణ కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఏడుకొండలు, సీహెచ్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

5న వాహనాల వేలం

కావలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిబ్రవరి 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ వేలం ఉంటుందని పేర్కొన్నారు.

గుండెపోటుతో తెలుగు పండిట్ మృతి

కావలి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయా బాలుర ఉన్నత పాఠశాల తెలుగు పండిట్, గాయని పోలవరం దేవకీదేవి సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్ చౌదరి ఆమె మృతికి సంతాపంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, కళా ప్రముఖులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సంగం : మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టి శ్రీనివాసులు (40) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈనెల 23వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఆమేరకు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

బస్ షెల్టర్‌లో వృద్ధుడు..

ఉదయగిరి : స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌లో సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన కె వెంకటయ్య (65) సోమవారం మృతిచెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మూడు రోజుల క్రితం నెల్లూరులో వైద్యం చేయించుకుని ఉదయగిరికి వచ్చాడు. మూడు రోజులుగా భార్య వెంకటమ్మతో కలిసి బస్ షెల్టర్‌లో ఉంటున్నాడు. సోమవారం మృతిచెందాడు. అనారోగ్యం కారణంగానే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల ఎనిమిది మంది మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున సోమవారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విష గుళికలు తిని గేదెల మృతి

అనంతసాగరం : మండలంలోని వెంగంపల్లి పొలాల సమీపంలో అనంతసాగరానికి చెందిన రైతు రాపూరు సుబ్బారెడ్డికి చెందిన రెండు గేదెలు విష గుళికలు తిని మృతిచెందాయి. గేదెల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని వాపోయాడు. వెంగంపల్లికి చెందిన ఇద్దరు అనుమానితులపై బాధితుడు అనంతసాగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

సంగం : మండలంలోని మర్రిపాడు ఎస్టీ కాలనీలో సోమవారం విద్యుత్‌ఘాతంతో పవన్ అనే విద్యార్థికి గాయాలయ్యాయి. వివరాల మేరకు... కాలనీకి చెందిన పోలయ్య, పుల్లమ్మ దంపతుల కుమారుడు పవన్ స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఇంటికి సమీపం లో పొలాల్లో ఉన్న 11 కెవి విద్యుత్ తీగలకు గాలిపటం చిక్కుకుని దారం వేలాడుతోంది. కాగా, గా లిపటానికి రాగి వైరు వినియోగించడంతో దాన్ని పట్టుకున్న పవన్ విద్యుదాఘాతానికి గురై చేతికి గాయాలు కావడంతో తల్లిదండ్రులు బాలున్ని వైద్యాశాలకు తరలించడంతో బాలుడికి ప్రమాదం తప్పింది.

న్యూస్ బాక్స్

టీడీపీ నేతల సంబరాలు



కేకు కట్ చేస్తున్న పార్టీ నాయకులు

కందుకూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయ్యింది. సోమవారం కందుకూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేకు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో నడుస్తున్న ప్రజా ప్రభుత్వం వచ్చేందుకు లోకేష్ చేపట్టిన పాదయాత్రే కారణం అన్నారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, నార్నె రోశయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గుమ్మా శివ, భైరపనేని రమణయ్య, బొద్దులూరి కొండలరావు, రావుల రవి, మన్నం కృష్ణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ఉదయగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గణతంత్ర దినోత్సవ వేడుకలకు గైర్హాజరైన మండలంలోని వెంగళరావునగర్ సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో అప్పాజీ సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. జూనియర్ లైన్‌మెన్ జీ అనిల్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీ రవికుమార్, డిజిటల్ అసిస్టెంట్ బీ మాధవి, మహిళా పోలీసు షేక్ సర్తాజ్‌సుల్తానాలకు షోకాజ్ నోటీసులు అందజేశారు. నోటీసు అందుకున్న మూడు రోజుల్లో వ్యక్తిగతంగా హాజరై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

లేఅవుట్లపై అవగాహన పెంచాలి

బిట్రగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లు కొనుగోలు చేసే వారు నష్టపోకుండా ఆ లేఅవుట్ల అనుమతులు ఉన్నది.. లేనిది ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ సుజాత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూర్యఘర్‌పై రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై వివరించాలన్నారు. మండల ప్రజల అవసరార్థం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను ఉదయం, సాయంత్ర వేళలో సకాలంలో తిరిగేలా చూడాలన్నారు. మండలంలో అక్రమ లేఅవట్లు పుట్టుకొస్తున్నాయని ఎంపీటీసీ సుందర్‌రాజ్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్య క్రమంలో ఈవోపీఆర్డీ నయీం తాజ్ హసన్ పాల్గొన్నారు.

బాలకృష్ణకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శుభాకాంక్షలు

కందుకూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్రం ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డు ప్రకటించటం హర్షనీయం అని, ఇది తెలుగుజాతికే గర్వకారణమని కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న నందమూరి బాల కృష్ణకు మరెన్నో పురస్కారాలు రావాలని శ్రీకాంత్ ఆకాంక్షించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

దగదర్తి, (బిట్రగుంట) జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దారు పీకృష్ణను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు కోరారు. పలు గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బీసీ కాలనీవాసులను తీసుకెళ్లి సోమవారం గ్రీవెన్స్ డేలో తహసీల్దారును కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ హయాంలో అర్హులైన ఎంతో మందికి పింఛన్లు మంజూరు కాలేదని, ఇపుడు వారికి న్యాయం చేయాలన్నారు. చెన్నూరు పంచాయతీ కట్టుబడిపాలెంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామాల నుంచి వచ్చిన వారికి మాలేపాటి సోదరులు భోజన ఏర్పాట్లు చేశారు.

సరైన పత్రాలతో వస్తే న్యాయం చేస్తాం

ఉదయగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వాస్తవంగా భూములు కలిగి ఉండి రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లు నమోదు కాని రైతులు అందుకు సంబంధించిన సరైన పత్రాలతో వస్తే న్యాయం చేస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు జహీర్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో రీసర్వే కార్యక్రమం నిర్వహించి రైతుల భూములకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అనూష, సర్వేయరు మీరావలి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చెన్నయ్య ఎంపిక

ఉదయగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా మోటపూతల చెన్నయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమ వారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సీనియర్ అధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామి నాయుడు ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యులు చెన్నయ్యను ఏగ్రీకంగా ఎంపిక చేశారు.